# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శనివారం 19-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 268 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## చరిష్మా ఉన్న ప్రపంచ నేతల్లో బైడెన్‌ను మించిన మోదీ

న్యూఢిల్లీ, జూన్ 18:ప్రపంచంలో మంచి చరిష్మా ఉన్న నేతల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీనే అగ్రస్థానాన్ని సంపాదించారు. అగ్రదేశాధినేతలకన్నా ముందు నిలిచారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా 13 అగ్రదేశాధినేతల కన్నా ప్రధాని మోదీకే ఎక్కువ మంది పట్టం కట్టారు మరి. 'మార్నింగ్ కన్సల్ట్' అనే సంస్థ చేసిన సర్వేలో 66 శాతం మంది ప్రధాని నరేంద్ర మోదీనే మళ్లీ దేశాధినేతగా కావాలని కోరుకుంటున్నారట. 'గ్లోబల్ లీడర్ అప్రూవల్ రేటింగ్ ట్రాకర్' పేరిట ఆ సర్వే ఫలితాలను మార్నింగ్ కన్సల్ట్ వెల్లడించింది.

భారత్‌లో 2,126 మందిని సర్వే చేస్తే అందులో 66 శాతం మంది.. ప్రధాని మోదీకి ఆమోదం తెలిపారు. మరో 28 శాతం మంది వ్యతిరేకత వ్యక్తం చేశారు. అయితే, ఏడాదిలో ఈ స్కోరు పడిపోయిందని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి హోదా కల్పించే 370 అధికరణాన్ని రద్దు చేసిన ఆగస్టు 2019లో ఆయన్ను 82 శాతం మంది ఆమోదించారని వెల్లడించింది. అప్పట్లో కేవలం 11 శాతం మందే మోదీని వ్యతిరేకించారంది. ఇప్పుడు జన ఆమోదం 16 శాతం పడిపోయింది.

ఇక, 65 శాతం మంది ఆమోదంతో మోదీ తర్వాతి స్థానంలో ఇటలీ ప్రధాని మారియో ద్రాఘీ ఉన్నారు. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆరో స్థానంలో ఉన్నారు. ఆయన్ను 53 శాతం మంది ఎంచుకున్నారు. మూడో స్థానంలో మెక్సికో అధ్యక్షుడు ఆండ్రూస్ మాన్యుయెల్ లోపెజ్ ఓబ్రడార్ (63%) ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ (54%), జర్మనీ చాన్స లర్ ఏంజెలా మెర్కెల్ (53%), కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడూ (48%), బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ (44%), దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ (37%), స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ (36%), బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో (35%), ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్ (35%), జపాన్ ప్రధాని యోషిహిదే సూగా (29%) ఉన్నారు. వారం రోజుల సగటు ఆధారంగా ఈ సర్వే ఫలితాలను వెల్లడించినట్టు మార్నింగ్ కన్సల్ట్ పేర్కొంది. సర్వేను ఆన్ లైన్‌లో చేసినట్టు తెలిపింది.

## భారత్‌లో 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు

హైదరాబాద్ , జూన్ 18:దేశంలో కరోనాను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు భారత్‌లో తయారు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్ లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ హాస్పిటల్లో కోవిడ్ రోగులను కేంద్ర మంత్రి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత్ బయోటెక్‌కు వ్యాక్సిన్ అడ్వాన్స్ కింద రూ.1500 కోట్లు కేటాయించామని వివరించారు. దేశంలో ఆక్సిజన్ కొరతను 15 రోజుల్లోనే అధిగమించామని చెప్పారు. తెలంగాణలో 46 ఆస్పత్రులకు 1400 వెంటిలేటర్లు ఇచ్చామని, దీపావళికి 80 కోట్ల మందికి అదనంగా 5 కిలోల చొప్పున బియ్యం అందించనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. కరోనా థర్డ్ వేవ్‌పై తప్పుడు ప్రచారం జరుగుతోందని.. అనవసరంగా ప్రజలను భయపెట్టొద్దని కిషన్ రెడ్డి సూచించారు.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన కథలాపూర్ మండల ఎంపీటీసీలు

హైదరాబాద్ , జూన్ 18: వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇవాళ మంత్రి కేటీఆర్‌ను ప్రగతి భవన్‌లో కలిశారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ సూచన మేరకు గంభీరపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేయాలని కేటీఆర్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

గంభీరపూర్‌లో 344 ఎకరాల్లో మామిడి, పసుపు స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా అందుబాటులో ఉన్న మామిడి, పసుపు పంటలకు సంబంధించి రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. జగిత్యాల జిల్లాలో 36 వేల ఎకరాల్లో మామిడి, పసుపు 22 వేల ఎకరాల్లో పండిస్తున్నామని తెలిపారు.

ఈ రెండు ప్రధాన పంటల ప్రాసెసింగ్, శుద్ధి మన ప్రాంతంలోనే జరిగితే రైతులకు గిట్టుబాటు ధర రావడమే కాకుండా, వేలాది మందికి ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ తెలిపారు.

దీని ఏర్పాటుకు గంభీరపూర్‌లో 344 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందన్నారు.

ఈ ప్రతిపాదనను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపు రెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్, వైస్ ఎంపీపీ కిరణ్ రావు, ఎంపీటీసీలు ధన్యవాదాలు తెలిపారు.



## రైతువేదికలు ప్రారంభించిన మంత్రి జగదీష్ రెడ్డి



నల్లగొండ, జూన్ 18:: జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నల్లగొండ మండలం ఖాజీ రామారం, తిప్పర్తి మండలం అనిశెట్టిదు ప్పలపల్లి, పజ్జూరు గ్రామాల్లో రైతు వేదికల ను ప్రారంభించారు. అలాగే తిప్పర్తిలో సహకార సొసైటీ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతు వేదికల నిర్మాణం దేశానికే ఆదర్శమన్నారు. సాగులో రైతుల కష్టాలను పరిష్కరించుకునేదుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్, జేడీఏ శ్రీధర్‌రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు రాంచంద్ర నాయక్, జెడ్పీ ఫ్లోర్ లిడర్ పాశం రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చర్యల అంతానికి ఏకమౌదాం : డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ , జూన్ 18: తెలంగాణలో రైతు వ్యతిరేక చర్యలను అంతం చేసేందుకు మనమంతా ఏకం అవుదామని రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. నకిలీ పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్న 13 మంది సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను వెస్ట్ జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ రేంజ్ ఐజీ శివశంకర్ రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏవీ రంగనాథ్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ రెడ్డి, ఇతర పోలీస్ అధికారులతో కలిసి మీడియాకు వెల్లడించారు. దేవరకొండ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు నల్లగొండ టాస్క్ ఫోర్స్ బృందాలు 15 రోజులుగా ఈ నకిలీ దందా వ్యవహారంపై లోతుగా దర్యాప్తు నిర్వహించారు. అక్రమ దందాకు పాల్పడుతున్న 13 మంది నిందితులను అరెస్టు చేశారు.

ఇంత పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలను పట్టుకోవడంపై డీజీపీ మహేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్విట్టర్ ద్వారా స్పందించారు. రూ.6 కోట్ల విలువైన 200 టన్నుల నకిలీ విత్తనాలను నల్లగొండ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించిన వెస్ట్ జోన్ ఐటీ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్, కేసు చేధనలో పాల్గొన్న ప్రతిఒక్కరికి అభినందనలు తెలిపారు. తెలంగాణ రైతులకు మద్దతుగా మీ ప్రయత్నాలను కొనసాగించాల్సిందిగా తెలిపారు.

రైతు వ్యతిరేక చర్యలను అంతం చేయడానికి మనం ఏకం అవుదాం

## రాష్ట్రాలకు 27.90 కోట్ల వ్యాక్సిన్ డోసులు: కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 18:దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇప్పటివరకు 27.90 కోట్ల కొవిడ్ వ్యాక్సిన్ డోసులను సమకూర్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఒక ప్రకటన చేసింది. కేంద్ర పంపిన 27.90 కోట్ల వ్యాక్సిన్ డోసులలో వ్యర్థమైన వాటితో కలిపి రాష్ట్రాలు 25.32 కోట్ల డోసులను వినియోగించినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది.

ప్రస్తుతం రాష్ట్రాల దగ్గర 2.58 కోట్లకుపైగా వ్యాక్సిన్ డోసులు అందుబాటులో ఉన్నాయని, మరో రెండు మూడు రోజుల్లో దాదాపు ఇంకో 20 లక్షల డోసులు రాష్ట్రాలకు చేరుకుంటాయాని కేంద్రం స్పష్టంచేసింది. కాగా, దేశంలో కరోనా సెకండ్ ప్రభావం చాలావరకు తగ్గినా వ్యాక్సినేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతున్నది. అదేవిధంగా దేశవ్యాప్తంగా రోజూ 15 లక్షలకు తగ్గకుండా కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

## వ్యాక్సినేషన్ తో దవాఖానలో చేరే ముప్పు 80 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ, జూన్ 18:కరోనా కట్టడికి ప్రజలు సత్వరమే వ్యాక్సిన్ వేయించుకోవాలని నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే పాల్ కోరారు. వ్యాక్సినేషన్ తర్వాత కరోనా చికిత్సకు ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితి 75 నుంచి 80 శాతం మేరకు తగ్గుతుందని ఇటీవలి అధ్యయనాల్లో వెల్లడైందని ఆయన తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి కొవిడ్-19 బారినపడినా ఆక్సిజన్ సపోర్ట్ అవసరం కేవలం 8 శాతానికి తగ్గుతుందని, ఐసీయూలో చేరాల్సిన ముప్పు కేవలం ఆరు శాతమేనని డాక్టర్ పాల్ పేర్కొన్నారు.

ఇక కరోనా థర్డ్ వేవ్ చిన్నారులపై పెద్దగా ప్రభావం చూపదని, వారిలో కేసులు అరుదుగానే నమోదవుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏండ్ల లోపు వారిలో సెరోపాజిటివిటీ రేటు 56 శాతం, 18 ఏండ్లు పైబడినవారిలో 63 శాతంగా ఉందని, దీంతో చిన్నారులకు వైరస్ సోకినా స్వల్పంగానే ఉంటుందని సంకేతాలు వస్తున్నాయని చెప్పారు.

## ప్రత్యేక హోదాపై సీఎం జగన్ కీలక వ్యాఖ్య

అమరావతి, జూన్ 18:ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యం కాదని, ప్రత్యేక హోదా ముగిసిన అధ్యయనం అని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, తాజాగా ఏపీ సీఎం వైఎస్ జగన్ హోదాపై కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నామని సీఎం జగన్‌అన్నారు. 2021-22 ఏడాదికి సంబంధించిన జాబ్ క్యాలెండర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం మాట్లాడుతూ, ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావించారు. ప్యాకేజీ, ఓటుకు కోట్లు కేసు కోసం గత పాలకులు హోదాను తాకట్టు పెట్టారని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలోని ఇద్దరు పెద్దలు కేంద్రమంత్రి పదవులు కూడా చేపట్టారని.. గత ప్రభుత్వం మాటలతో భ్రమ కల్పించిన విషయం అందరికీ తెలుసునని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రానికి మంచి జరుగుతుందని ఆశతో ఉన్నామని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.

ఓటుకు కోట్ల కోసం గత ప్రభుత్వం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ప్యాకేజీ కోసం రాజీపడిందని, ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రత్యేకహోదా ఇవ్వాలని రిక్వెస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రత్యేకహోదా ద్వారా ప్రైవేటు రంగంలో వచ్చే ఉద్యోగాలనూ తాకట్టు పెట్టారన్నారు. దేవుడి దయతో ఎప్పుడో ఓ సారి మంచి జరుగుతుందని అనుకుంటున్నానని చెప్పారు. కొవిడ్ పరిస్థితుల్లో రాష్ట్ర ఆదాయం తగ్గిందన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా చర్యలు చేపట్టామని సీఎం జగన్ వెల్లడించారు.

## పరీక్షల కోసం ప్రైవేట్ హాస్పిటల్స్‌కు పంపిస్తే కఠిన చర్యలు

మహబూబ్‌నగర్, జూన్ 18:: స్కానింగ్‌కు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ దవాఖానలను ఏర్పాటు చేసిందని, అంతేకాక అధునాతన పరికరాలతో తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ దవాఖాన డాక్టర్లు స్కానింగ్ కోసం ప్రైవేటు కేంద్రాలకు వెళ్లమనడం మంచిదికాదన్నారు. ఒకవేళ ఎవరైనా ఆ విధంగా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శుక్రవారం మంత్రి మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో 200 ఆక్సిజన్ పడకల ప్రారంభోత్సవం సందర్భంగా దవాఖానకు వచ్చిన పలువురు మహిళలతో మాట్లాడారు.

డాక్టర్లు స్కానింగ్, ఇతర పరీక్షల నిమిత్తం తమను ప్రైవేటు కేంద్రాలకు వెల్లమంటున్నారని మంత్రికి ఫిర్యాదు చేయగా మంత్రి పైవిధంగా స్పందించారు.

దవాఖాన ల్యాబ్ ఇంచార్జి, డాక్టర్లను పిలిపించి మాట్లాడగా.. రేడియాలజిస్ట్ ఒకరే ఉన్నందున గర్భిణిలకు 5వ నెలలో నిర్వహించే టిఫా స్కాన్ కు సమయం తీసుకుంటున్నందున ప్రైవేట్ కేంద్రాలకు రాస్తున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ దవాఖానల్లోనే అన్ని పరీక్షలు నిర్వహించాలన్నారు. ఒకవేళ ఏదైనా పరీక్షల నిర్వహణకు ఆలస్యం అయ్యేలా ఉంటే రోగులకు తెలియజేయాలని సూచించారు.

మంత్రి వెంట కలెక్టర్ ఎస్.వెంకట రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, మున్సిపల్ చైర్మన్ కె.సి నర్సింహులు, దవాఖాన పర్యవేక్షకుడు డాక్టర్ రాంకిషన్, దవాఖాన సలహా కమిటీ సభ్యురాలు లక్ష్మి, తదితరులు ఉన్నారు.

## నెలాఖరులో గ్రేటర్‌లో రెండు పడక గదుల ఇళ్లు ప్రారంభం

హైదరాబాద్ , జూన్ 18: గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఈ నెలాఖరులో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26, 28 అదేవిధంగా జులై 1, 4 తేదీల్లో లబ్దిదారులకు ఇళ్లు కేటాయించనున్నారు. రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ లబ్దిదారులకు ఇళ్ల పత్రాలు అందజేయనున్నారు. పీవీ మార్గ్‌లోని అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన 330 ఇళ్లను అదేవిధంగా జీవైఆర్ కాంపౌండ్‌లో 180, పొట్టి శ్రీరాములునగర్‌లో 162, గొల్ల కుర్మయ్య కాలనీలో 10 ఇళ్లను మంత్రి కేటీఆర్ లబ్దిదారులకు పంపిణీ చేయనున్నారు. నిర్మాణం పూర్తైన మరొకొన్ని చోట్ల దశలవారీగా లబ్ధిదారులకు ఇళ్ల అందజేయనున్నారు.నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సీఎం కేసీఆర్ సంకల్పంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 111 ప్రాంతాల్లో చేపట్టిన లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను విడతల వారీగా లబ్ధిదారులకు జీహెచ్ఎంసీ అందజేస్తున్నది. ఇప్పటికే 12 చోట్ల 2478 ఇండ్లను ప్రారంభించగా, తాజాగా మరో ఆరు చోట్ల 1273 ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నది.

## దత్తత గ్రామానికి సీఎం కేసీఆర్?

హైదరాబాద్ , జూన్ 18:తెలంగాణ సీఎం కేసీఆర్ తన దత్తత గ్రామాన్ని సందర్శించనున్నారు. ఈ నెల 22వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలోని వాసాలమర్రికి సీఎం కేసీఆర్ వెళ్లనున్నారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఏర్పాట్లను పరిశీలించారు. వాసాలమర్రి గ్రామ సర్పంచ్ అంజయ్యతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. తన పర్యటన రోజు ఊరంతా కలిసి సామూహిక భోజనం చేద్దామని చెప్పారు. గ్రామ సభ ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిద్దామని పేర్కొన్నారు.

వాసాలమర్రి గ్రామాన్ని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. గతేడాది నవంబర్ నెలలో జనగామ జిల్లా కొడకండ్లలో పర్యటన ముగించుకుని తిరుగు పయనమైన సీఎం కేసీఆర్ వాసాలమర్రిలో ఆగి, గ్రామాభివృద్ధిపై స్థానికులతో చర్చించారు. అనంతరం గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వాసాలమర్రి గ్రామాన్ని అంకాపూర్, ఎర్రవల్లి తరహాలో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. గ్రామ రూపురేఖలు మార్చేందుకు 50 నుంచి 100 కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

## వాసాలమర్రి సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జూన్ 18: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ సర్పంచ్ అంజయ్యతో రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఫోన్‌లో మాట్లాడారు.

వాసాలమర్రి గ్రామా న్ని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 22న సీఎం గ్రామ సందర్శనకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ గ్రామ సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ రోజు ఊరంతా కలిసి సామూహిక భోజనం చేద్దామని చెప్పారు.

గ్రామ సభ ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిద్దామని పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఏర్పాట్లను పరిశీలించారు.

## మహమ్మారిని తేలికగా తీసుకోవద్దు : డాక్టర్ హర్షవర్ధన్

న్యూఢిల్లీ : కరోనా వ్యాక్సిన్ వచ్చిన తర్వాత ప్రజలు కొవిడ్-19 నిబంధనలను పాటించడంలో అలసత్వం ప్రదర్శిస్తూ మహమ్మారిని తేలికగా తీసుకుంటున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. ప్రజలు కొవిడ్-19 ప్రొటోకాల్ ను విధిగా పాటించాలని, మాస్కులు ధరిస్తూ, భౌతిక దూరం నిబంధనలను పాటించాలని కోరారు. అన్ లాక్ ప్రక్రియ ప్రారంభమైనా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మనమందరం అప్రమత్తంగా ఉంటూ కరోనా కట్టడికి అన్ని చర్యలూ చేపడితేనే మహమ్మారి అంతమవుతుందని డాక్టర్ హర్షవర్ధన్ ట్వీట్ చేశారు. మనం ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా కరోనా నిబంధనలను పాటించాలని, అందరూ త్వరగా వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన ట్వీట్ చేశారు. కరోనా వైరస్ సమసిపోలేదని, అది తన రంగులు మార్చుకుంటోందని ఎయిమ్స్ మెడిసిన్ డిపార్ట్ మెంట్ హెడ్ డాక్టర్ నవనీత్ విగ్ హెచ్చరికల నేపథ్యంలో ఆరోగ్య మంత్రి ఈ ప్రకటన చేశారు.

## నిర్మల్‌ను ప్రగతి పథంలో నిలబెడతాం : మంత్రి అల్లోల



నిర్మల్, జూన్ 18:: పల్లెలు, పట్టణాలు పచ్చదనంతో ఉంచడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం పని చేస్తుందని అటవీ, పర్యావరణ, శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణ ప్రగతిలో భాగంగా శివాజీ చౌక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రూ. 5.50 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు వెడల్పు, సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. సీఎం కేసీఆర్ గ్రామ, పట్టణ ప్రాంతాలకు నెలనెల నిధులు మంజూరు చేస్తున్నారని వెల్లడించారు.

నిర్మల్ పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. పట్టణ ప్రగతితో ముందుగా పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చుకుందామని చెప్పారు. ఎక్కడ కూడా చెత్త లేకుండా నీటుగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్యం లోపించకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ శ్రీ "భద్రిరాజు"కులజుని
ప్రాభవమున్నట్టి తెలుగు పరిశోధక మ
త్తే భమును "కృష్ణమూర్తి"ని
నా భాజు సముద్రైన విదుని నయుమున గాలుతున్॥

( జూన్ 19 భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తి జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ ఉద్యోగ్ ఆధార్ మెమొరాండంను డిసెంబర్ 31 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 18:సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వశాఖ, ఒరిజినల్ నోటిఫికేషన్ నెం. ఎస్.ఒ. 2119( ఇ) తేదీ 26-06-2020ను 16-06-2021తేదీ 2347 ( ఇ) ప్రకారం దాని ఇఎం పార్ట్ -2, యుఎఎంఎస్ ల చెల్లుబాటును 31.03.2021 నుంచి 31.12.2021 వరకు పొడిగించడం జరిగింది.

ఇది ఇఎం పార్ట్ -2, యుఎఎంఎస్ కలిగిన వారు ప్రస్తుత వివిధ పథకాల కింద గల నిబంధలన ప్రకారం ప్రయోజనాలు పొందడానికి వీలు కలుగుతుంది. అలాగే ఎం.ఎస్.ఎం.ఇలకు ప్రాధాన్యతా రంగ రుణ ప్రయోజనాలను కూడా కల్పిస్తుంది.

ప్రస్తుత కోవిడ్ పరిస్థితులలో ఎం.ఎస్.ఎం.ఇలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అలాగే వివిధ ఎం.ఎస్.ఎం.ఇ అసోసియేషన్లు, ఆర్థిక సంస్థలు, ఎం.ఎస్.ఎం.ఇ రంగంతో వ్యవహరిస్తున్న వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి వచ్చిన అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుత ఇఎం పార్ట్ -2 , యుఎఎం హోల్డర్లు ఉద్యం కొత్త రిజిస్ట్రేషన్‌కు మారడానికి అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనిని 2020 జూలై 1న ప్రారంభించారు. దీన ద్వారాప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంది. ఇది ఎం.ఎస్.ఎం.ఇలను బలోపేతం చేయడానికి ఉపకరిస్తుంది. ఫలితంగా ఇది సత్వర రికవరీకి, వారి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయడానికి , ఉపాధి కల్పించడానికి వీలు కలుగుతుంది.

ఆసక్తిగల ఎంటర్ ప్రైజ్‌లవారు ఉచితంగా https://udyamregistration.gov.in ఎలాంటి డాక్యుమెంట్లు అవసరం లేకుండా రిజిస్టర్ చేయించుకోవచ్చు. ఉద్యం పోర్టల్‌లో రిజిస్టర్ చేయించుకోవడానికి పాన్, ఆధార్ ఉంటే సరిపోతుంది. ఇప్పటివరకు ఈ పోర్టల్ 17.06.2021 (సాయంత్రం 5.26.43 గంటల సమయానికి 33,16,210 ఎంటర్ ప్రైజ్‌ల రిజిస్ట్రేషన్, వర్గీకరణకు వీలు కల్పించింది.

# వైభవంగా ముదిరాజుల పెద్దమ్మ-దుర్గమ్మ అమ్మవార్ల బోనాల పండుగ

**-పట్టువస్త్రాలు సమర్పించిన మున్సిపల్ చైర్మన్,కమిషనర్**
**-హాజరైన ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు**



రాజన్న సిరిసిల్ల, జూన్ 18(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని ముదిరాజుల కులస్తుల ఆరాధ్య దేవతలైన శ్రీ పెద్దమ్మ-దుర్గమ్మ అమ్మవార్ల బోనాల పండుగను సంఘం అధ్యక్షుడు బైరి సతీష్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీ బద్ది పోచమ్మ తల్లి,పెద్దమ్మ-దుర్గమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.బోనాల పండుగ పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం తరుపున చైర్ పర్సన్ రామతీర్థపు మాధవిరాజు,కమిషనర్ శ్యామ్ సుందర్ రావు లు పట్టువస్త్రాలు సమర్పించారు.అనంతరం అమ్మవార్ల ను దర్శించుకుని ముదిరాజులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.వచ్చిన అతిథులకు సంఘం నాయకులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైరి సతీష్ ,గౌరవ అధ్యక్షుడు రేగుల మల్లికార్జున్,బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆది శ్రీనివాస్,వైస్ చైర్మన్ మధు రాజేందర్,ఎంపీపీ బండ మల్లేశం,టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు,సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి,కౌన్సిలర్లు రేగుల సంతోష్ బాబు,కందుల శ్రీలత క్రాంతి కుమార్,మారం కుమార్,వంగల శ్రీనివాస్,ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి చిక్కుడు మల్లేశం,ఉపాధ్యక్షుడు రేగుల నర్సయ్య, కోశాధికారి బొడిగే రాజు,రైటర్ పిల్లి సిద్ధార్థ, ముఖ్య సలహాదారుడు ఎదుల పరమేశం,ప్రచార కార్యదర్శి రేగుల దేవయ్య,కార్యదర్శి రేగుల మల్లేశం లతో పాటు ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు,పెద్దఎత్తున ముదిరాజ్ కులస్తులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవార్లకు బోనాల సమర్పణ :**

ముదిరాజుల ఆరాధ్య దేవతలైన పెద్దమ్మ-దుర్గమ్మ బోనాల పండుగ సందర్భంగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ శుక్రవారం ఉదయం బద్ది పోచమ్మ అమ్మవారికి ముదిరాజ్ మహిళలు బోనాలు సమర్పించారు.అనంతరం సాయంత్రం పట్టణంలోని మహాలక్ష్మీ వీధిలో ఉన్నటువంటి శ్రీ పెద్దమ్మ-దుర్గమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.కరోనా మహమ్మారి అంతమై ప్రజలు సురక్షితంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.వర్షాలు సంవృద్ధిగా కురిసి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

**టి ఆర్ కే ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పణ**

ముదిరాజుల బోనాల పండుగ సందర్భంగా టి ఆర్ కే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఎన్నారై తోట రామ్ కుమార్ తరుపున ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు.వారి వెంట ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ 32వరోజులుగా కొనసాగుతున్న అన్నదానం



రాజన్న సిరిసిల్ల, జూన్ 18(నేటినిజం ప్రతినిధి): 'మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు' ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు శుక్రవారం 32వ రోజుకు చేరాయి. శుక్రవారం వేములవాడ పట్టణంలో లక్ష్మి గణపతి కాంప్లెక్స్ వద్ద మరియూ ఆలయ పరిధిలో ఉంటున్న అన్నార్థులకు , హోమ్ ఐసోలేషన్ నందు ఉన్న కరోనా పేషంట్లకు, ద్యూటీ డాక్టర్లకు మొత్తం 100 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్ ,భస్మాంగి బస్వరాజు, డాక్టర్ బెజ్జంకి రవీందర్, నాగురి మహేష్ , ముంజ ఉమెందర్, కటకం జనార్దన్, నండిపేట రమణ యాదవ్, పొలాస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తోట రామ్ కుమార్ జన్మదినం సందర్భంగా...
# అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

రాజన్న సిరిసిల్ల, జూన్ 18(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ లోని మహాలక్ష్మి ఆలయంలోని పెద్దమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు శుక్రవారం టి.ఆర్.కె చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ జన్మదిన సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఈ ఏడు సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంట బాగుండాలని కోరుకున్నామని తెలిపారు అలాగే నిత్యం ప్రజాసేవకే పరితపించే నాయకుడు, నిస్వార్థ సేవకుడు తోట రామ్ కుమార్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని వేడుకుందామ అని తెలిపారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పులి రాంబాబు, ముప్పిడి శ్రీధర్, గంగవరం శ్రీధర్, ట్రస్ట్ వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీం సభ్యులు పాల్గొన్నారు.



# ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లద్వారా జాతికి 32000 టన్నుల 'ఎల్ఎంఓ' సరఫరా

న్యూఢిల్లీ, జూన్ 18: దేశవ్యాప్తంగా వైద్యపరమైన ద్రవ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) రవాణాకు ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ, కొత్త పరిష్కారాలతో ముందడుగు వేసిన భారత రైల్వేశాఖ వివిధ రాష్ట్రాలకు ఎంతో ఊరటనిస్తూ ప్రాణవాయువును సకాలంలో చేరవేసింది. ఈ మేరకు ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లు జాతికి అందిస్తున్న సేవలో భాగంగా ఇప్పటివరకూ 32,000 టన్నులకుపైగా 'ఎల్ఎంఓ'ను సరఫరా చేయడంద్వారా కొత్త మైలురాయిని అధిగమించాయి. తదనుగుణంగా నేటిదాకా మొత్తం 443 ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లు 1,830 ట్యాంకర్లతో 32,017 టన్నుల ప్రాణవాయువును దేశంలోని వివిధ రాష్ట్రాలకు చేరవేసి, లక్ష్యాన్ని పూర్తిచేయడమేగాక ఎంతో ఉపశమనం కలిగించాయి. ఇందులో ఒక్క దక్షిణాది రాష్ట్రాలకే 17,600 టన్నులకుపైగా 'ఎల్ఎంఓ'ను సరఫరా చేయగా, తమిళనాడుకు 5,600 టన్నుల మేర అందించాయి. అలాగే తెలంగాణ.. ఆంధ్రప్రదేశ్.. కర్ణాటక రాష్ట్రాలకు 3,200; 4,000; 4100 టన్నుల మేర 'ఎల్ఎంఓ'ను రవాణా చేశాయి. దేశవ్యాప్తంగా ప్రాణవాయువు సరఫరా సంబంధిత వివరాలు అందే సమయానికి 1 ట్యాంకర్లలో 78 టన్నుల 'ఎల్ఎంఓ'తో మరో ఎక్స్ ప్రెస్ మార్గమధ్యంలో ఉంది.

ఈ ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లు 54 రోజుల కిందట ఏప్రిల్ 24న మహారాష్ట్రలో 126 టన్నుల 'ఎల్ఎంఓ'ను అందించడం ద్వారా తమ ప్రయాణం ప్రారంభించడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ప్రాణవాయువు కోసం విజ్ఞప్తి చేసిన రాష్ట్రాలకు వీలైనంత తక్కువ సమయంలో ఆక్సిజన్ సరఫరాను భారత రైల్వేశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీనికి అనుగుణంగా మొత్తం 15 రాష్ట్రాలు- ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, అస్సాంలకు ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లద్వారా ప్రాణవాయువు సరఫరాతో ఎంతో ఉపశమనం లభించింది. ప్రాణవాయువు సరఫరాకు సంబంధించి కడపటి సమాచారం అందేసరికి మహారాష్ట్రకు 614 టన్నులు; ఉత్తరప్రదేశ్‌కు దాదాపు 3797 టన్నులు, మధ్యప్రదేశ్‌కు 656 టన్నులు, ఢిల్లీకి 5722 టన్నులు, హర్యానాకు 2354 టన్నులు, రాజస్థాన్‌కు 98 టన్నులు, కర్ణాటకకు 4149 టన్నులు, ఉత్తరాఖండ్‌కు 320 టన్నులు, తమిళనాడుకు 5674 టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 4036 టన్నులు, పంజాబ్‌కు 225 టన్నులు, కేరళకు 513 టన్నులు, తెలంగాణకు 3255 టన్నులు, జార్ఖండ్‌కు 38 టన్నులు, అస్సాం రాష్ట్రానికి 530 టన్నుల చొప్పున 'ఎల్ఎంఓ' సరఫరా చేయబడింది.

ఈ మేరకు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌ల ద్వారా ఇప్పటివరకూ దేశంలోని 15 రాష్ట్రాల్లోగల సుమారు 39 నగరాలు/పట్టణాలకు 'ఎల్ఎంఓ' రవాణా చేయబడింది. రాష్ట్రాలవారీగా- లక్నో, వారణాసి, కాన్పూర్, బరేలీ, గోరఖ్‌పూర్, ఆగ్రా (ఉత్తరప్రదేశ్); సాగర్, జబల్‌పూర్, కట్నీ, భోపాల్ (మధ్యప్రదేశ్); నాగ్‌పూర్, నాసిక్, పూణే, ముంబై, సోలాపూర్ (మహారాష్ట్ర); హైదరాబాద్ (తెలంగాణ); ఫరీదాబాద్, గురుగ్రామ్ (హర్యానా); తుగ్లకాబాద్, ఢిల్లీ కంటోన్మెంట్, ఓఖ్లా (ఢిల్లీ); కోట, కనక్‌పడా (రాజస్థాన్); బెంగళూరు (కర్ణాటక); డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్); నెల్లూరు, గుంటూరు, తిరుపతి, తాడిపత్రి, విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్); ఎర్నాకుళం (కేరళ); తిరువళ్లూరు, చెన్నై, ట్యుటికోరిన్, కోయంబత్తూరు, మదురై (తమిళనాడు); భటిండా ఫిలౌర్ (పంజాబ్); కామరూప్ (అస్సాం); రాంచీ (జార్ఖండ్) వంటి నగరాలు/పట్టణాలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఆక్సిజన్ సరఫరాకు వీలున్న ప్రదేశాలుగల వివిధ మార్గాలను భారత రైల్వేశాఖ ముందుగానే గుర్తించింది. తదనుగుణంగా ఏ రాష్ట్రంలోనైనా అవసరం పడిన సందర్భంలో అక్కడికి ఆక్సిజన్ రవాణాకు సదా సన్నద్ధతతో ఉంది. కాగా, 'ఎల్ఎంఓ' తీసుకొచ్చేందుకు ఆయా రాష్ట్రాలు రైల్వేశాఖకు ట్యాంకర్లను సమకూరుస్తాయి. వీటిద్వారా దేశం నలుదిక్కులలో పలుచోట్లగల ఆక్సిజన్ ఉత్పాదక ప్రాంతాలు- పశ్చిమాన హాపా, బరోడా, ముంద్రా; తూర్పున రూర్కెలా, దుర్గాపూర్, టాటానగర్, అంగుల్ వంటి ప్రదేశాల నుంచి ట్యాంకర్లలో ఆక్సిజన్ నింపి, దాన్ని ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాలకు సంక్లిష్ట రైలు మార్గాలద్వారా రకరకాల ప్రణాళికల ప్రాతిపదికన చేరవేస్తుంది.

ప్రాణవాయువు అవసరాలను వీలైనంత త్వరగా తీర్చడం కోసం ఆక్సిజన్ రవాణా ఎక్స్ ప్రెస్ రైళ్లను నడపడంలో రైల్వేశాఖ ఎన్నడూ ఎరుగని సరికొత్త ప్రమాణాలు, మైలురాళ్లను సృష్టిస్తోంది. దూరప్రాంత మార్గాల్లో ఈ కీలకమైన రవాణా రైళ్ల సగటు వేగం అనేక సందర్భాల్లో 55 కిలోమీటర్లకన్నా ఎక్కువగా ఉంటోంది. అత్యంత ప్రాముఖ్యంగల హరిత కారిడార్‌లో వివిధ నిర్వహణ మండళ్ల బృందాలు అత్యంత క్లిష్ట పరిస్థితుల మధ్య కూడా 24 గంటలూ శ్రమిస్తూ నిర్దేశిత సమయానికి ఆక్సిజన్ గమ్యానికి చేరేవిధంగా కర్తవ్యం నిర్వర్తిస్తున్నాయి. వివిధ సెక్షన్ల నడుమ సిబ్బంది విధులు మారడం కోసం సాంకేతికంగా నిలపాల్సిన సమయాన్ని కేవలం 1 నిమిషం స్థాయికి తగ్గించడం విశేషం. మరోవైపు ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్ రైళ్లు ఎక్కడా ఆగకుండా దూసుకెళ్లేందుకు వీలుగా ఆయా మార్గాలు సదా అందుబాటులో ఉంచబడుతున్నాయి. అదే సమయంలో ఇతర సరకు రవాణా రైళ్ల నిర్వహణకు భంగం కలగకుండా ఈ బాధ్యతను నెరవేరుస్తుండటం విశేషం. సరికొత్త ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌ల నిర్వహణ చురుకైన కసరత్తు మాత్రమేగాక, సంబంధిత గణాంకాలు కూడా ఎప్పటికప్పుడు నవీకరించబడుతున్నాయి. ఇక ట్యాంకర్లలో ప్రాణవాయువు నింపుతున్న నేపథ్యంలో ఈ రాత్రి మరికొన్ని ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లు బయల్దేరనున్నాయి.

# మ్యూకార్ మైకోసిస్ మందులకోసం ప్రభుత్వం చర్యలు!

న్యూఢిల్లీ, జూన్ 18: కోవిడ్ వైరస్ నుంచి కోలుకున్నప్పటికీ, మ్యూకార్ మైకోసిస్ అనే సంక్లిష్ట వ్యాధితో బాధపడుతున్న రోగులకు నిర్దేశించే యాంఫో టెరిసిన్-బి. అనే ఔషధానికి కొన్ని రాష్ట్రాల్లో అకస్మాత్తుగా గిరాకీ పెరిగినట్టు ఒక పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో, ఈ మందు సమస్థాయిలో అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ఔషధ ఉత్పత్తిని బలోపేతం చేసేందుకు, దిగుమతి చేసుకునేందుకు పలు చర్యలు అమలు చేసింది. వివిధ రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లోని రోగులకోసం 6.67లక్షల వయల్స్ యాంఫోటెరిసిన్-బి మందును ప్రభుత్వం సమీకరించగలిగింది. మ్యూకార్ మైకోసిస్ చికిత్సలో వినియోగించే యాంపోటెరిసిన్ డీయాక్సీ కోలేట్, పోసాకొనాజోల్ వంటి మందులతో పాటుగా, యాంఫోటెరిసిన్-బి. ఔషధాన్ని కూడా ప్రభుత్వం సమీకరించ గలిగింది.

మ్యూకార్ మైకోసిస్ వ్యాధి చికిత్సకోసం వినియోగించే మందుల లభ్యతను కేంద్ర ఔషధ వ్యవహారాల శాఖ ఎప్పటికప్పుడు మదింపు చేస్తూ వస్తోంది. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సి.డి.ఎస్.సి.ఒ.) అందించిన సమాచారం ఆధారంగా స్వదేశీ మార్కెట్లో, దిగుమతుల ద్వారా అందుబాటులో ఉన్న ఔషధాల పరిస్థితిపై అంచనా కోసం ఈ ప్రక్రియ చేపడుతున్నారు. ఉత్పత్తి, నిల్వ, సరఫరా, కొనుగోలు ఆర్డర్లు వంటి అంశాలపై వివరాలను ఉత్పత్తిదార్లనుంచి సేకరించే ప్రక్రియ ఈ ఏడాది మే నెలనుంచి జరుగుతోంది. గిరాకీకి, ఉత్పత్తికి మధ్య ఏర్పడిన అంతరాన్ని అధిగమించేందుకు సహకరించవలసిందిగా తయారీదార్లను కూడా కోరారు. ఇందుకు సంబంధించి వివిధ కేంద్ర శాఖల మధ్య ఈ ఏడాది మే నెల 10న ఒక సమావేశం జరిగింది. కేంద్ర ఔషధ వ్యవహారాల శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, సి.డి.ఎస్.సి.ఒ., ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డి.జి.హెచ్.ఎస్.) ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఔషధాల లభ్యతపై ఈ సమావేశంలో కూలంకషంగా సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పరిమిత స్థాయిలో ఉన్న ఔషధ నిల్వలను కేటాయించవచ్చని, తద్వారా, గిరాకీ సరఫరా మధ్య నెలకొన్న అంతరాన్ని అధిగమించవచ్చని ఈ సమీక్షా సమావేశం అభిప్రాయపడింది.

ఉత్పత్తి హెచ్చింపు

దేశీయంగా ఉత్పత్తిని బలోపేతం చేసేందుకు కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. ఔషధాల తయారీలో వినియోగించే ముడిపదార్థాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఉత్పత్తిదార్లతో సంప్రదింపులు జరుపుతూ వచ్చింది. ఉత్పత్తిదార్లను, ప్రత్యామ్నాయ ఔషధాలను గుర్తించేందుకు, కొత్త ఉత్పత్తి సదుపాయాల ఏర్పాటును ఆమోదించేందుకు కేంద్ర ఔషధ వ్యవహారాల శాఖ, భారతీయ ఔషధ నియంత్రణ సంస్థ (డి.జి.సి.ఐ.) ఎంతో సమన్వయంతో క్రియాశీలంగా పనిచేశాయి. ఔషధాల ఉత్పత్తి సంస్థలను సంప్రదించి, ఉత్పత్తి పెంచాల్సిన ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. లిపోసోమాల్ యాంఫోటెరిసిన్-బి ఉత్పత్తికి సంబంధించిన ప్రస్తుత ఉత్పత్తి దార్లు కూడా తమ ఉత్పత్తిని పెంచాలని ఈ సందర్భంగా కోరారు. మ్యూకార్ మైకోసిస్ చికిత్సలో వాడే ప్రత్యామ్నాయ ఔషధాల ఉత్పత్తిని పెంచే అంశాన్ని కూడా ఉత్పత్తి దారులతో చర్చించారు. ఉత్పత్తిదార్లు, దిగుమతిదార్ల ఆందోళనలు, లైసెన్సింగ్ వ్యవహారం, ముడి పదార్థాల లభ్యత వంటి అంశాల పరిష్కారానికి యత్నాలు కూడా వేగంగా జరుగుతున్నాయి.

ప్రస్తుతం లిపోసోమాల్ యాంపోటెరిసిన్-బి ఔషధాన్ని భారత్ సీరమ్స్ వ్యాక్సీన్ లిమిటెడ్, సిప్లా, సన్ ఫార్మా, బి.డి.ఆర్. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ కేర్ ఇన్నవేషన్స్ అనే ఐదు సంస్థలు తయారు చేస్తున్నాయి. ఆ సంస్థల ద్వారా దాదాపు 2.63 లక్షల వయల్స్ మేర ఈ మందు ఈ ఏడాది జూన్ నెలలో విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లిపోసోమాల్ ఫార్ములా ఔషధం తయారీ ప్రక్రియ చాలా సంక్లిష్టమైనది. అధునాత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరిశ్రమలు మాత్రమే ఈ మందును తయారు చేయగలుగుతాయి. ఈ నేపథ్యంలో ఔషధ తయారీదార్లతో సంప్రదింపుల అనంతరం యాంఫోటెరిసిన్-బి సూది మందు తయారీ, మార్కెటింగ్ కోసం ఆరు సంస్థలకు డి.జి.సి.ఐ. అనుమతి జారీ చేసింది. ఎమ్.క్యూర్, గుఫిక్, అలెంబిక్, లైకా, నాట్కో లిమిటెడ్, ఇంటాస్ ఫార్మా వంటి ఆరు సంస్థలకు ఈ అనుమతి లభించింది. ఈ కొత్త సంస్థల ద్వారా జూన్ నెలలో దాదాపు లక్షా 13వేల వయల్స్ వెలువడవచ్చని భావిస్తున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 62,000 వయల్స్ మేర ఉన్న యాంఫోటెరిసిన్-బి ఔషధ ఉత్పత్తి సామర్థ్యం,..మే నెలలో లక్షా 63వేల వయల్స్ కు పెరిగింది. జూన్ నెలలో ఉత్పత్తి సామర్థ్యం 3.75లక్షల వయల్స్ కు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అంటే అతి స్వల్ప వ్యవధిలోనే ఉత్పత్తి ఐదురెట్లు పెరిగే సూచనలు ఉన్నాయన్నమాట.

ఔషధ ఉత్పత్తి పరిస్థితిపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ వస్తోంది. ఉత్పత్తిని పెంపునకు సంబంధించిన సమస్యలను గుర్తించేందుకు తయారీదార్లతో పలుసార్లు సమావేశాలను నిర్వహించింది. వారితో ఎప్పటికప్పుడూ సంప్రదింపులు జరుపుతూ వస్తోంది. ఉత్పత్తిని, సరఫరాను పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా కంపెనీలను కోరుతూ వస్తోంది.

దిగుమతికి వెసులుబాటు

ఔషధాల ఉత్పత్తికి పేరుగాంచిన విదేశాల్లోని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరపడంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. మ్యూకార్ మైకోసిస్ చికిత్సలో వాడే యాంపోటెరిసిన్-బి/లిపోసోమాల్ యాంపీటెరిసిన్-బి ఇంజెక్షన్లు, ఇతర ప్రత్యామ్నాయ ఔషధాల ప్రాప్తి స్థానాలను ప్రపంచంలోని అన్ని దేశాల్లోని రాయబార కార్యాలయాలు, దౌత్య కార్యాలయాల ద్వారా విదేశాంగ మంత్రిత్వ శాఖ గుర్తించింది. గుర్తించిన వనరుల ద్వారా ఆస్ట్రేలియా, రష్యా, జర్మనీ, అర్జెంటీనా, బెల్జియం, చైనా దేశాలనుంచి లిపోసోమాల్ యాంఫోటెరిసిన్-బి ఇంజెక్షన్లను సేకరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరింది. మరో వైపు,..లిపోసోమాల్ యాంఫోటెరిసిన్-బి ఇంజెక్షన్.ను భారతదేశంలో తయారు చేసేందుకు వీలుగా,. మందు తయారీలో కీలకమైన అనుపానంగా వాడే హెచ్.ఎస్.పి.సి., డి.ఎస్.పి.జి-ఎన్.ఎ. వంటి వాటిని తప్పనిసరిగా తెప్పించే ప్రక్రియలో విదేశాంగ మంత్రిత్వ శాఖ క్రియాశీలంగా పనిచేస్తోంది.

ఇక, ఔషధం దిగుమతిని పెంచేందుకు, అమెరికాకు చెందిన మెసర్స్ గిలీడ్స్ ఇన్.కార్పొరేషన్ సంస్థతో సత్వర బట్వాడాకోసం ఔషధ వ్యవహారాల శాఖ, అమెరికాలోని భారతీయ రాయబార కార్యాలయం కలసి ప్రధాన దిగుమతి సంస్థ అయిన మైలాన్ ల్యాబ్స్.తో నిర్విరామంగా చర్చలు జరుపుతూ వస్తున్నాయి. గిలీడ్ సంస్థనుంచి మొత్తం 9,05,000వయల్స్ కోసం ఆర్డలు పెట్టగా, ఈ ఏడాది జూన్ 16వ తేదీనాటికి 5,33,971 వయల్స్ మైలాన్ సంస్థకు అందాయి. మిగిలిన వయల్స్.ను కూడా త్వరగా తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కేటాయింపు

పరిమిత స్థాయిలో అందుబాటులో ఉన్న ఔషధం నిల్వలు సమంగా పంపిణీ జరిగేలా చూస్తూ... సదరు పరిమిత నిల్వలనే అవసరమైన రాష్ట్రాలకు కేటాయించాలని నిర్ణయించారు. మ్యూకార్ మైకోసిస్ రోగులకు చికిత్స అందించాల్సిన రాష్ట్రాలకు తప్పనిసరిగా, సమంజసమైన వాటా రూపంలో ఔషధాలు తప్పనిసరిగా అందేలా ఈ చర్య తీసుకున్నారు. ఇక, లిపోసోమాల్ యాంఫోటెరిసిన్-బి ఇంజెక్షన్ విషయంలో మాత్రమే కేంద్ర ప్రభుత్వం కేటాయింపు జరుపుతూ వస్తోంది. లిపోసోమాల్, లిపిడ్, ఎమల్షన్ రూపంలో మందును తయారీ చేసే భారత్ సీరమ్ సంస్థను మినహాయించి మిగతా ఉత్పత్తి సంస్థల ఇంజెక్షన్ల కేటాయింపును కేంద్ర ప్రభుత్వమే చేపడుతోంది. సంప్రదాయపరమైన యాంపోటెరిసిన్ మందును ఈ ఏడాది జూన్ 14నుంచి కేటాయిస్తూ వస్తోంది. ఔషధానికి ఉన్న డిమాండును అంచనా వేసిన అనంతరం ఈ కేటాయింపు జరుపుతూ వస్తున్నారు.

ఆయా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఔషధం సమస్థాయిలో పంపిణీ జరిగేలా చూసేందుకు కూడా అనేక చర్యలు తీసుకుంటున్నారు. దేశంలో రికార్డయిన కేసులతో పోల్చితే ఆయా రాష్ట్రాల్లో నమోదైన కేసుల సంఖ్య ప్రాతిపదికగా ఈ కేటాయింపు జరుగుతూ వస్తోంది. రోగుల సంఖ్యకు సంబంధించి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వెబ్ పోర్టల్ లో ఆయా రాష్ట్రాలు పొందుపరిచిన సమాచారం ఆధారంగా కేటాయింపు చేస్తున్నారు. డిమాండ్ కు తగినట్టుగా ఔషధాల సరఫరా జరిగే వరకూ ఈ తరహా కేటాయింపు ప్రక్రియ తాత్కాలికంగా అమలులో ఉంటుంది.

ఏదైనా ఒక నగరంలో, పట్టణంలో, ఆసుపత్రిలో ఔషధం సరఫరా, లభ్యత వంటి అంశాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకుంటాయి. లిపోసోమాల్ ఆంఫోటెరిసిన్-బి ఔషధాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తయారీదార్లనుంచి సేకరిస్తున్నాయి. కేటాయింరు ప్రాతిపదికగా ఈ మందును సంబంధిత ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెస్తున్నారు. ఈ ఏడాది జూన్ 14వ తేదీవరకూ చేసిన కేటాయింపుల ప్రకారం మొత్తం 6,67,360 వయల్స్ మేర ఔషధాన్ని ఆయా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ఔషధ వ్యవహారాల శాఖ కేటాయించింది. దీనికి తోడు,..సంప్రదాయంవరమైన యాంఫోటెరిసిన్-బి ఇంజెక్షన్ కు సంబంధించి 53,000వయల్స్.ను ఈ ఏడాది జూన్ 14న కేటాయించారు.

సరఫరా ఏర్పాట్లు

అవసరమైన వారికి ఔషధం అందుబాటులో ఉండేలా చూసేందుకు కేంద్ర ఔషధ ధరల నిర్ణాయక ప్రాధికార సంస్థ (ఎన్.పి.పి.ఎ.) సరఫరా ప్రక్రియను పర్యవేక్షిస్తూ వస్తోంది. కేటాయించిన పరిమాణంలో ఔషధం సకాలంలో సరఫరా జరిగేలా చూసే పటిష్టమైన ప్రతిస్పందక వ్యవస్థను ఎన్.పి.పి.ఎ. ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఔషధ సరఫరాదార్లతో క్రమంతప్పకుండా సంప్రదింపులు జరుపుతూ వస్తోంది. ఆయా రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖలకు ఔషధాల సరఫరాలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే అప్పటికప్పుడు తగిన పరిష్కారం చూపుతూ వస్తోంది.

కోవిడ్ సంబంధిత మ్యూకార్ మైకోసిస్ చికిత్సా నిర్వహణకు సంబంధించి కొన్ని ఆదేశాలను, సూచనలను కేంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది జూన్ 7న సర్క్యులేట్ చేసింది. కోవిడ్-19 చికిత్సపై ఏర్పాటైన కార్యాచరణ బృందానికి (టాస్క్ ఫోర్స్.కు) ఈ మేరకు ఆదేశాలు, సూచనలు జారీ చేసింది. మ్యూకార్ మైకోసిన్ చికిత్సలో యాంఫోటెరిసిన్-బి, లిపిడ్ కాంప్లెక్స్, లిపోసోమాల్ యాంఫోటెరిసిన్-బి, యాంఫోటెరిసిన్ డీయాక్సీ కోలేట్, పోసా కొనాజోల్ వంటి మందులను ఎలా వాడాలి, ఏ పరిస్థితుల్లో వాడాలి అన్న అంశాలను ఈ ఆదేశాల్లో పొందుపరిచారు.

ఇక కేటాయించిన మందులను సమంజసంగా వినియోగించాల్సిన ఆవశ్యకతను, వాటి సరఫరా ఆవశ్యకతను వివరిస్తూ కేంద్ర ఔషధ వ్యవహారాల శాఖ కూడా ఈ ఏడాది జూన్ 10న ఆదేశాలు జారీ చేసింది. వివిధ రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖల కార్యదర్శులందరికీ ఈ ఆదేశాలు సర్క్యులేట్ అయ్యాయి.

మరో వైపు, మ్యూకార్ మైకోసిస్ చికిత్సకు అవసరమైన ఔషధాల ఉత్పత్తి, దిగుమతి, సరఫరా, లభ్యత వంటి అంశాలపై తాజా పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తూ వస్తోంది. ఇందుకోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో, ఉత్పత్తి సంస్థలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతూ వస్తోంది.

# ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) 2020-21 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక టర్నోవర్ నమోదు

న్యూఢిల్లీ, జూన్ 18:కొవిడ్ -19 మహమ్మారి పూర్తిగా దెబ్బతిన్న సంవత్సరంలో కూడా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) అత్యధిక టర్నోవర్‌ను నమోదు చేసింది. 2020-21 సంవత్సరంలో కెవిఐసి స్థూల వార్షిక టర్నోవర్‌ను రూ. 95,741.74 కోట్లు. 2019-20లో అది రూ.88,887 కోట్ల టర్నోవర్. తద్వారా 7.71% పెరుగుదల నమోదైంది.

గత ఏడాది మార్చి 25 న ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ సందర్భంగా మూడు నెలలకు పైగా ఉత్పత్తి కార్యకలాపాలు నిలిపివేయబడినందున 2020-21లో కెవిఐసి రికార్డ్ పనితీరు గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ కాలంలో అన్ని ఖాదీ ఉత్పత్తి యూనిట్లు మరియు అమ్మకపు దుకాణాలు కూడా మూసివేయబడ్డాయి. ఇవి ఉత్పత్తి మరియు అమ్మకాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఏది ఏమయినప్పటికీ, "ఆత్మనిర్భర్ భారత్" మరియు "వోకల్ ఫర్ లోకల్" కొరకు గౌరవనీయ ప్రధానమంత్రి పిలుపు మేరకు కెవిఐసి వేగంగా పెరిగింది. సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ యొక్క వినూత్న మార్కెటింగ్ ఆలోచనలు కెవిఐసి యొక్క ఉత్పత్తి శ్రేణిని మరింత వైవిధ్యపరిచాయి. స్థానిక ఉత్పత్తిని పెంచాయి. తద్వారా ఖాదీ యొక్క వరుస వృద్ధికి మార్గం సుగమం చేశాయి. 2015-16 సంవత్సరంతో పోల్చితే 2020-21లో ఖాదీ, గ్రామ పరిశ్రమ రంగాలలో మొత్తం ఉత్పత్తి 101% వృద్ధిని నమోదు చేయగా, ఈ కాలంలో స్థూల అమ్మకాలు 128.66% పెరిగాయి. ఖాదీ ఈ-పోర్టల్, ఖాదీ మాస్క్‌లు, ఖాదీ పాదరక్షలు, ఖాదీ ప్రకృతి పెయింట్, ఖాదీ హ్యాండ్ శానిటైజర్లు మొదలైనవి రికార్డు స్థాయిలో కొత్త పిఎమ్ఇజిపి యూనిట్ల ఏర్పాటు, కొత్త ఎస్ఎఫ్‌యుఆర్‌టి క్లస్టర్‌లు, ప్రభుత్వ చేపట్టిన "స్వదేశీ" వంటి కార్యక్రమాలు మరియు సదుపాయాల సరఫరా కోసం పారామిలిటరీ దళాలతో కెవిఐసి యొక్క చారిత్రాత్మక ఒప్పందాలు మహమ్మారి సమయంలో గ్రామ పరిశ్రమల టర్నోవర్‌ను పెంచాయి. ఉత్పత్తితో పోలిస్తే రూ. 2019-20లో రూ 65,393.40 కోట్లు, గ్రామ పరిశ్రమ రంగంలో ఉత్పత్తి 2020-21లో రూ. 70,329.67 కోట్లు. అదేవిధంగా, 2020-21 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు రూ. 92,214.03 కోట్లు. 2019-20లో 84,675.29 కోట్లు.

అయితే దేశవ్యాప్తంగా స్పిన్నింగ్ మరియు నేత కార్యకలాపాలు మహమ్మారి సమయంలో పెద్ద విజయాన్ని సాధించడంతో ఖాదీ రంగంలో ఉత్పత్తి మరియు అమ్మకాలు కొద్దిగా తగ్గాయి.

# పచ్చదనానికి పరవశించిపోతున్న ప్రకృతి ప్రేమికులు

**పర్యాటక ప్రాంతాన్ని తలపింపజేస్తున్న పోలీసు శిక్షణ కేంద్రం**



కరీంనగర్ జూన్ 18(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్‌లోని కమిషనరేట్ పోలీసు శిక్షణ కేంద్రం(సిటిసి)లో మియావాకి పద్ధతిలో చిట్టడవులు, గతంలో జరిగిన హరితహారంలో నాటిన మొక్కలన్నీ సంరక్షించబడటంతోపాటు వివిధ రకాల నూతన ప్రాజెక్టుల ఏర్పాటుతో ఆ ఆవరణ అంతా పచ్చదనం పరుచుకుని ఉండటంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. రోజురోజుకూ వివిధప్రాంతాల నుండి వస్తున్న ప్రజల సంఖ్య పెరుగుతూ వస్తూ పర్యాటక ప్రాంతాన్ని తలపింపజేస్తున్నది. అన్నివర్గాలకు చెందిన ప్రజలు సందర్శించడం, ఉదయం వేళల్లో వాకింగ్‌నకు అనుమతి ఇవ్వడంతో ప్రతిరోజు ప్రస్తుతం వందలసంఖ్యలో సిటిసిలోని వనాలు, ఇతర ప్రాజెక్టులను సందర్శించేందుకు విచ్చేస్తున్నారు. ఈ సిటిసిలో మియావాకి పద్ధతిలో పెంచబడిన చిట్టడవులు ప్రాజెక్ట్-1, ప్రాజెక్ట్-2లతోపాటు పలు నూతన ప్రాజెక్టుల నిర్మాణం, వాకర్స్ కోసం ప్రత్యేకంగా పచ్చనిచెట్ల మధ్య ట్రాక్‌ను నిర్మించడం, ఇటీవల ప్రారంభించబడిన రాక్‌గార్డెన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడ మియావాకి పద్ధతిలో పెంపుదలకొనసాగిస్తున్న చిట్టడవులను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా యాదాద్రి మోడల్‌ఫారెస్ట్‌ను అమలు చేస్తున్న విషయం విదితమే.

**5కిలోమీటర్ల ప్రత్యేక వాకింగ్‌ట్రాక్**

కమిషనరేట్ పోలీస్ శిక్షణకేంద్రం(సిటిసి)లో పెంపొదల కొనసాగిస్తున్న మియావాకి ప్రాజెక్ట్-1, ప్రాజెక్ట్-2లతో పాటు అన్నిరకాలకు చెందిన మొక్కలతో పెంచబడుతున్న ప్రాంతాలను సందర్శిస్తున్నారు. వీటితోపాటు గతంలో జరిగిన హరితహారంలో నాటి సంరక్షించబడిన మొక్కలు(నేడు వృక్షాలు)మధ్య ఏర్పాటు చేసిన 2.5కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ వాకర్లను, ప్రకృతి ప్రేమికుల హృదయాలను దోచుకుంటోంది. ప్రస్తుతఎండాకాలంలో పశువులకు నీటికొరత లేకుండా ఉండేందుకు నీటితొట్టెలను ఏర్పాటు చేయడంతోపాటు వాటికి ఆహారం అందించేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. చేపల పెంపక కేంద్రం, గ్రామాల్లో ఉండే చేదబావి, పశువుల పెంపకకేంద్రం, గడ్డివాములు, ఎడ్లబండి, వర్షాకాలంలో వరదనీరు నిలువకుండా కొనసాగిస్తున్న నిర్మాణాలు, పల్లెప్రాంతాల్లోని వాతావరణాన్ని తలపింపజేసేవిధంగా వివిధ రకాల నిర్మాణాలపై తెలంగాణ పల్లెల సంస్కృతి,సంప్రదాయాలను తెలియజేసేవిధంగా వేయించిన పేయింటింగ్‌లను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

**నవగ్రహ, రాశి,నక్షత్ర వనాలపై ఆసక్తితో సందర్శన, అధ్యయనం**

నవగ్రహ,రాశి,నక్షత్ర వనాల ప్రాంతాలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ రకాల రాశులు, వాటి నక్షత్రాలు, ఏయేరాశులకు చెందిన వారికి వర్తింపబడే సంబంధిత మొక్కలను కూడా ఏర్పాటు చేయించారు. తమరాశి, అందుకు సంబంధించిన నక్షత్రం, ఆ రాశి, నక్షత్రాలకు తనకు సంబంధించిన మొక్కలను తీక్షణంగా పరిశీలించి, వీటి ఏర్పాటు కోసం తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకుంటున్నారు. నవగ్రహ వనం వద్ద పంచతత్వసిద్ధాంతంతో నిర్మించిన 08రకాల సహజవనరులతో నిర్మించిన ట్రాక్ సందర్శన సందర్భంలో ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు. సిటిసిలో అన్నిరకాలకు చెందిన 60వేలకు పైగా మొక్కలు పెంచబడుతున్నాయి. హరితహారం, మియావాకి చిట్టడవుల ప్రాంతాల్లో మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి.

**ఆకర్షణీయం రాక్‌గార్డెన్**

సిటిసిలో ఏర్పాటు చేసిన రాక్‌గార్డెన్(రాతివనం) అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు అందించిన సహకారంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ శిల్పులతో ఇనుప, సిమెంట్,లప్పంలతో పూర్తిగా వృక్షాలకు చెందిన ఖాండాలతో నిర్మించినట్లు స్పష్టంగా కనిపించేలా వివిధ రకాల పేయింటింగ్‌లను వినియోగించారు. కుర్చీలు ఏర్పాటు ప్రాంతంలో ఎండతగులకుండా చేపట్టిన రక్షణచర్యల్లో భాగంగా గజీబా(గొడుగును), వివిధ అటవి జాతులకు చెందిన జంతువులు, పక్షుల బొమ్మలతోపాటు ఎడారి ప్రాంతాల్లో ఉండే వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేయడంతోపాటు కృత్రిమంగా ఏర్పాటుచేసిన చేపల పెంపకం కేంద్రాన్ని కొలనును తలపింపజేసే రీతిలో నిర్మించారు. దానిపై వంతెన, ఆ కొలనులో మౌంటేన్‌వాటర్‌ఫాల్‌ను నిర్మించారు.

**ప్రజాప్రతినిధులు, అన్నిశాఖ అధికారుల సహకారంతో ముందుకుసాగుతున్నాం**
**-పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి**

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల వనాల నిర్మాణంలో ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు అందిస్తున్న సహకారంతో తాము వనాలు, వివిధ రకాల నూతన ప్రాజెక్టుల నిర్మాణాలను కొనసాగిస్తున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం సిటిసి ఆవరణలో 60వేలకు పైగా మొక్కలు పెంచబడుతున్నాయని, గతంలో జరిగిన హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయని పేర్కొన్నారు. ఈ వర్షాకాలంలో 05నుండి06వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సిటిసితోపాటు కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లు, సర్కిళ్ళు, డివిజన్ కేంద్రాల్లోని కార్యాలయాల ఆవరణలతోపాటు పోలీస్‌శాఖకు చెందిన స్థలాల్లో మొక్కలను నాటనున్నామని చెప్పారు. వనాల పెంపుదల కోసం అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేయడమే కాకుండా వివిధ రకాల మొక్కలు లభ్యమయ్యే ప్రాంతాలకు సంబంధించిన సమాచారం తెలియజేస్తూ వాటిని పరిశీస్తూ, సంరక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని నూతన మొక్కలు నాటడం, ఈ ఆవరణలోని పలు ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే చర్యలను నిరంతరం కొనసాగించనున్నామని పేర్కొన్నారు.

# శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న సీజేఐ ఎన్వీ రమణ దంపతులు



శ్రీశైలం, జూన్ 7:శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లిఖార్జున స్వామి వార్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలోని నంది నికేతన్ అతిథిగృహం వద్ద జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు ఏపీ దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఎంపీ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, కర్నూలు జిల్లా కలెక్టర్ వీరపాండియన్, ఆలయ ఈవో కేఎస్ రామారావు తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభం, వేద మంత్రోచ్ఛారణలతో సీజేఐ దంపతులను ఆలయంలోకి ఆహ్వానించారు.

జస్టిస్ ఎన్వీ రమణ పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాల వద్ద పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా ఇటీవలే జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు తిరుపతిలో శ్రీవారిని, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న విషయం తెలిసిందే.

# కార్పొరేటర్లతో కలిసి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ధర్నా..

హైదరాబాద్ , జూన్ 18:హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద బీజేపీ కార్పొరేటర్లు, చింతల రామచంద్రారెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాజాసింగ్ ధర్నాకు దిగారు. నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో జీహెచ్ఎంసీ కార్యాలయం గేటు వద్ద బైఠాయించిన బీజేపీ నేతలు, కార్యకర్తలు గేటు ఎక్కేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అదుపు చేశారు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు అక్కడ నినాదాలు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురుకాకూడదని, సత్వరమే నాలాల్లో పూడికతీతలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



జనగామ,జూన్ 18: : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కొడకండ్ల మండలం రామరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు బంధావుడు సీఎం కేసీఆర్ అన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా రైతు బంధు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు.

# పెట్రో ధరలు పెరగకపోతేనే వార్త : మోదీ సర్కార్ పై రాహుల్ ఫైర్

న్యూఢిల్లీ, జూన్ 18: పెట్రోల్ ధరలు సెంచరీ దాటి పరుగులు పెడుతూ సామాన్యుడికి చెమటలు పట్టిస్తున్న నేపథ్యంలో పెట్రో సెగలపై నరేంద్ర మోదీ సర్కార్ లక్ష్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఇంధన ధరలు పెరగకపోతే అది పెద్ద వార్తగా నిలిచే దుస్థితికి చేరుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏ రోజైనా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుంటే ఆరోజు అది పెద్ద వార్తగా మారుతుండటం మోదీ సర్కార్ ఘనతని ఎద్దేవా చేశారు. పెట్రో ధరల మంటపై కాంగ్రెస్ పార్టీ ఇటీవల దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఇక పెట్రోల్ ధరలు శుక్రవారం కూడా లీటర్ కు 27 పైసలు పెరగ్గా, డీజిల్ ధరలు లీటర్ కు 28 నుంచి 30 పైసలు భారమయ్యాయి. తాజా పెంపుతో పలు మెట్రో నగరాల్లో ఇంధన ధరలు రికార్డు స్థాయికి ఎగిశాయి.

# పల్లెప్రగతిలో పచ్చదనం పెంపొందించాలి



జనగామ, జూన్ 18 : పల్లె ప్రగతిలో భాగంగా పచ్చదనం పెంపుతో ఉపాధి కూలీలు కృషి చేయాలని పంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం కొడకండ్ల మండలంలో మంత్రి పర్యటించారు. రహదారుల వెంట మొక్కలు నాటి వాటికి రక్షణగా గార్డులను ఏర్పాటు చేయక పోవడంతో దెబ్బతింటున్నాయి. వాటికి ముళ్ల కంచెతో రక్షణకు చర్యలు తీసుకోవాలని కూలీలకు మంత్రి సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో పచ్చదనం పెంపునకు వివిధ మొక్కలు నాటాలని ఆదేశించారు.

గ్రామ ప్రవేశం నుంచి రహదారికి ఇరువైపుల పచ్చదనంతో గ్రామాలకు కొత్త శోభ తేవాలన్నారు. పల్లె ప్రగతిలో నాటిన మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వన సేవకులు చెల్లింపులు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. నాటిన మొక్కలు వంద శాతం మనుగడ సాధించేలా సంరక్షణ రూపొందించాలన్నారు. మొక్కలకు షెడ్యూల్ ప్రకారం వాటరింగ్ కచ్చితంగా చేపట్టాలన్నారు.

# అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగుల చికిత్స కోసం సంస్థలతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించిన డాక్టర్ హర్షవర్ధన్

న్యూఢిల్లీ, జూన్ 18:అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగుల చికిత్స కోసం క్రౌడ్-ఫండింగ్ ద్వారా స్వచ్ఛంద నిధుల సేకరణ, క్షయ వ్యాధి నిర్మూలనపై దిగ్గజ వ్యాపార సంస్థల ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ఈ రోజు ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

మానవతా దృక్పథంతో ప్రైవేట్ రంగ సహకారంతో ఆపదలో ఉన్న వారిని ఏవిధంగా ఆదుకోవచ్చునన్న అంశాన్ని చర్చించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. కోవిడ్–19 రెండవ దశను సమర్ధంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలకు సహకరించిన ప్రభుత్వరంగ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఈ విషయంలో ప్రైవేట్ రంగ సంస్థలు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకుని రావడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ప్రైవేట్ రంగ సంస్థలు ముందుకు రావలసిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపరచడానికి, అరుదైన వ్యాధులతో బాధపడుతున్నవారి చికిత్సకు ఎదురవుతున్న నిధుల సమస్యలను పరిష్కరించడానికి ప్రైవేట్ రంగ సంస్థలు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఆయన కోరారు. సంస్థలు చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాల కింద ఈ నిధులను విడుదల చేయాలని ఆయన కోరారు.

ప్రపంచంలో 8%మంది అత్యంత అరుదైన వ్యాధులతో బాధ పడుతున్నారని చెప్పిన మంత్రి వీరిలో 75% పిల్లలు వుంటున్నారని వివరించారు. చికిత్సకు అవసరమయ్యే నిధుల కోసం పిల్లల తల్లితండ్రులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ క్రమంలో వారు ఆర్థికంగా మానసికంగా కుంగిపోతున్నారని మంత్రి అన్నారు.

అరుదైన వ్యాధులకు దేశంలోనే చికిత్స అందించడానికి ప్రభుత్వం పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నదని డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. అరుదైన వ్యాధులపై ఒక కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు చికిత్సకు నిధులను సమకూర్చడానికి గుర్తించిన ఎనిమిది సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ లలో ఖాతాలను తెరిపించామని మంత్రి వివరించారు. తక్కువ ఖర్చుతో అరుదైన వ్యాధులకు చికిత్స అందించి, ఔషధ ఉత్పత్తికి పరిశోధనా కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఐసీఎంఆర్, డీబీటీ, సీఎస్ఐఆర్ ల సహకారంతో పరిశోధనలను చేపట్టడానికి సంస్థను ఏర్పాటు చేశామని డాక్టర్ హర్షవర్ధన్ వివరించారు. అరుదైన వ్యాధుల నిర్ధారణ కోసం సీఎస్ఐఆర్ ఉచితంగా పరీక్షలను నిర్వహిస్తున్నదని అన్నారు. అరుదైన వ్యాధులకు చికిత్స అందించడానికి మందులను అభివృద్ధి చేసే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి అమలు చేస్తున్నామని మంత్రి అన్నారు.

చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఔషధాలకు కస్టమ్ సుంకం తగ్గించే అంశాన్ని ఆర్ధిక మంత్రిత్వశాఖ పరిశీలిస్తున్నదని అన్నారు.

అరుదైన వ్యాధులతో బాధ పడుతున్న వారికి చికిత్స అందించడానికి నిధులను సమీకరించడానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేకంగా నేషనల్ డిజిటల్ పోర్టల్ ఫర్ క్రౌడ్ ఫండింగ్ ను నెలకొల్పిందని డాక్టర్ హర్షవర్ధన్ వివరించారు. వ్యక్తులు, సంస్థలు దీనిద్వారా అరుదైన వ్యాధులకు చికిత్స అందించడానికి, వారిని సంరక్షించడానికి నిధులను విరాళంగా ఇవ్వవచ్చునని మంత్రి తెలిపారు. క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రభుత్వ పోర్టల్ ఏర్పాటుకావడం ఇదే తొలిసారని మంత్రి అన్నారు. అరుదైన వ్యాధులపై పరిశోధనలను చేపట్టడానికి లేదా అరుదైన వ్యాధి కలిగిన పిల్లలను దత్తత తీసుకోవడానికి కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థల నిధులను సమకూర్చడానికి ముందుకు రావాలని మంత్రి పిలుపు ఇచ్చారు.

ఖచ్చితమైన టీబీ స్క్రీనింగ్ మరియు డయాగ్నొస్టిక్ సాధనాలను అందుబాటులోకి తీసుకుని వచ్చి, కృత్రిమ మేధస్సుతో తో కూడిన డిజిటల్ ఎక్స్‌రే, నాట్ వినియోగం వల్ల దేశంలో టిబి కేసులను సకాలంలో గుర్తించడానికి వీలవుతున్నదని మంత్రి అన్నారు. అధిక నాణ్యత గల మందులు, డిజిటల్ టెక్నాలజీస్, సామాజిక సౌకర్యాలతో టిబి చికిత్స అందిస్తున్నామని డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. దీనితో దేశంలో టిబి కేసులు, మరణాలు వేగంగా తగ్గుతున్నాయని అన్నారు. ఎస్డిజి లక్ష్యం కంటే ఐదేళ్లు ముందుగానే ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ నిర్దేశించిన విధంగా 2025 చివరకిదేశంలో టీబీ ని నిర్మూలించడానికి కేంద్రప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని మంత్రి వివరించారు.

పోలియో మాదిరిగానే 2025 నాటికి టిబిని నిర్మూలించాలని డాక్టర్ హర్ష్ వర్ధన్ అన్నారు. పోలియోవ్యాధులను నిర్మూలించడానికి ప్రజలు, నాయకులు, పరిశ్రమలు కలసి సంయుక్తంగా పనిచేయవలసి ఉంటుందని అన్న డాక్టర్ హర్షవర్ధన్ పోలియో నిర్మూలనలో తన అనుభవాలను వివరించారు. పోలియో నిర్మూలనలో ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి సంస్థలపూర్తి సహకారాన్ని అందించాయని అన్నారు. 2025 నాటికి టిబినుంచి భారతదేశం విముక్తి పొందాలన్న ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ కల నెరవేర్చడానికి ఇదే విధానాన్ని అనుసరిస్తున్నామని అన్నారు. ప్రతి నెల 24 వ తేదీన టిబి నిర్మూలనలో వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని సంబంధిత తానూ వ్యక్తిగతంగా సమీక్షిస్తారని ఆయన అన్నారు.సమావేశంలో వివిధ రంగాలకు చెంది వ్యక్తులు పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ హర్షవర్ధన్ 2025 నాటికి భారతదేశంలో టీబీని నిర్మూలించడానికి ప్రతిజ్ఞ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీ రాజేష్ భూషణ్, కార్యదర్శి (హెచ్ఎఫ్‌డబ్ల్యు), శ్రీమతి ఆర్తి అహుజా, అదనపు కార్యదర్శి (హెచ్), శ్రీమతి రేఖ శుక్లా,సంయుక్త కార్యదర్శి , మరియు మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర అధికారులు హాజరయ్యారు. కార్పొరేట్ వ్యవహారాల కింద పిఎస్‌యుల ప్రతినిధులు మరియు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఒఎన్‌జిసి, గెయిల్), బొగ్గు మంత్రిత్వ శాఖ (కోల్ ఇండియా , నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్), విద్యుత్ మంత్రిత్వ శాఖ (ఎన్‌టిపిసి, ఎన్‌హెచ్‌పిసి, విద్యుత్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ (సెయిల్), రక్షణ మంత్రిత్వ శాఖ మరియు ప్రభుత్వ సంస్థల శాఖ, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (మజాగాన్ డాక్స్ షిప్‌బిల్డర్లు, గోవా షిప్‌యార్డ్) మరియు హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వంటి ప్రభుత్వ రంగ సంస్థల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అరుదైన వ్యాధుల కోసం నోటిఫై చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రతినిధులు, సిఐఐ, ఫిక్కీ, అసోచామ్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# అంతర్రాష్ట్ర నకిలీ విత్తనాల దందా ముఠా అరెస్ట్

నల్లగొండ, జూన్ 18:: నకిలీ పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్న 13 మంది సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెస్ట్ జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ రేంజ్ ఐజీ శివశంకర్ రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏవీ రంగనాథ్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ రెడ్డి, ఇతర పోలీస్ అధికారులతో కలిసి కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. దేవరకొండ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు నల్లగొండ టాస్క్ ఫోర్స్ బృందాలు 15 రోజులుగా ఈ నకిలీ దందా వ్యవహారంపై లోతుగా దర్యాప్తు నిర్వహించారు.



అక్రమ దందాకు పాల్పడుతున్న 13 మంది నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో నంద్యాలకు చెందిన కర్నాటి మధుసూదన్ రెడ్డిని గతంలో ఇదే తరహా కేసులో అరెస్టయి పీడీ యాక్ట్ కింద వరంగల్ జైలుకు వెళ్లివచ్చాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం ప్రవృత్తిని మార్చుకోకుండా నకిలీ పత్తి విత్తనాలను తయారీ చేసి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ సీజన్‌లో వీటిని విక్రయించేందుకు ఖమ్మంకు చెందిన పెద్దిరెడ్డి, నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన బాలస్వామి, దేవరకొండకు చెందిన పిచ్చయ్య, హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి, పవన్‌లతోపాటు మరికొంత మందితో ముఠాగా ఏర్పడి పెద్ద ఎత్తున దందా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

సమాచారం అందుకున్న జిల్లా పోలీసులు ఎస్పీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు సీఐలు బాలగోపాల్, ఎస్.ఎం. బాషా, చండూర్ సీఐ సురేష్ కుమార్, నల్లగొండ రూరల్ ఎస్ఐ రాజశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ పోలీస్ బృందాలు, శాలిగౌరరం సీఐ పీఎన్డీ ప్రసాద్, తిప్పర్తి ఎస్ఐ సత్యనారాయణ, చిట్యాల ఎస్ఐ నాగరాజు, ఎస్ఐ నాగుల్ మీరా, ఇతర పోలీసుల సహకారంతో నకిలీ విత్తనాల దందా గుట్టురట్టు చేశారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు సిద్దిపేటలోని గజ్వేల్, ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నంద్యాల, ఆళ్లగడ్డ, తెలంగాణలోని గద్వాల, మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలలోని గుండ్ల పోచంపల్లి, యల్లంపేట, దేవర యంజాల్, బోయినపల్లి తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 20 టన్నుల నకిలీ పత్తి విత్తనాలు, 140 టన్నుల వరి విత్తనాలు, 40 టన్నుల మొక్కజొన్న విత్తనాలు, నాలుగు కింటాళ్ల కూరగాయల విత్తనాలు స్వాధీనం చేసున్నారు.

### ప్రధాన నిందితుడు చార్టెడ్ అకౌంటెంట్..

ఈ కేసులో మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ప్రధాన నిందితుడు, చార్టెడ్ అకౌంటెంట్ ఏనుబోతుల శ్రీనివాస్ రెడ్డి మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లిలో నైరుతి సీడ్స్ పేరుతో కంపెనీ స్థాపించి అదే పేరుతో నకిలీ విత్తనాల దందా నిర్వహిస్తున్నాడని ఐజీ తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి గత నాలుగేండ్లుగా రైతుల నుంచి వరి, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలను తక్కువ ధరకు సేకరిస్తున్నాడు. ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రాసెసింగ్ యూనిట్లలో వాటిని ప్రాసెస్ చేసి జీఓటీ పరీక్షలను సైతం నిర్వహించకుండా, లైసెన్స్ లేకుండా సీడ్స్ ప్యాకింగ్ కవర్లు, వాటిపై క్యూఆర్ కోడ్, ఇతర లేబుల్స్ తానే ముద్రించి విక్రయించేవాడని తెలిపారు.

గడువు ముగిసిన ప్యాకెట్లను టిన్నర్ వినియోగించి గడువు తేదీలను చెరిపివేసి కొత్త తేదీలను ముద్రించి విక్రయించేవాడని చెప్పారు. శ్రీనివాస్ రెడ్డి భాగస్వామి మెడిశెట్టి గోవింద్‌కు చెందిన దేవరాయంజాల్‌లోని ఎంజీ అగ్రిటెక్ ప్రాసెసింగ్ యూనిట్‌లో నకిలీ పత్తి విత్తనాల ప్రాసెసింగ్ వ్యవహారంపై అతడిని విచారించగా నంద్యాలకు చెందిన గోరుకంటి పవన్ కుమార్‌ను తాను శ్రీనివాస్ రెడ్డి పరిచయం చేయగా అతని ద్వారా పాత నేరస్థులైన నంద్యాలకు చెందిన మధుసూదన్ రెడ్డి, స్వామిదాస్ పరిచయమైనట్లు తెలిపాడు.

వీరి నుంచి శ్రీనివాస్ రెడ్డి రిజెక్టెడ్ సీడ్స్, గడువు తీరిన విత్తనాలు, జిన్నింగ్ మిల్లుల నుంచి పత్తి గింజలను తీసుకొని వచ్చి తన ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రాసెస్ చేసిన అనంతరం ట్రూత్ ఫుల్ లేబుల్స్‌ను ముద్రించి అందమైన కవర్లలో ప్యాకింగ్ చేసి మార్కెట్లోకి తరలించేందుకు యత్నించినట్లు పోలీసులు గుర్తించారని ఐజీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. మరో ప్రధాన నిందితుడు మధుసూదన్ రెడ్డి 2016 నుంచి నకిలీ విత్తనాల కేసుల్లో పలుమార్లు అరెస్టయి గతేడాది పీడీ యాక్ట్ కింద జైలుకు వెళ్లి వచ్చి మళ్లీ ఇదే వ్యాపారాన్ని చేస్తున్నాడని వివరించారు. నంద్యాల ప్రాంతానికి చెందిన గోష స్వామిదాస్, దుబ్బ వెంకట శివారెడ్డి, హుస్సేన్ వలి అలియాస్ బాషా, బండారు సుధాకర్ తదితరుల వద్ద నుంచి కిలో రూ. 200లకు విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు కిలోకు రూ. 900 రూపాయలు (అరకిలో ప్యాకెట్ కు రూ. 450/–) చొప్పున విక్రయిస్తారని చెప్పారు.

అనుచరులైన చెన్నకేశవ రెడ్డి, మధుల సహకారంతో వీటిని రవాణా చేస్తున్నాడన్నారు. నంద్యాలకు చెందిన మరో నిందితుడు, పలు కేసుల్లో జైలుకెళ్లిన గోరుకంటి పవన్ కుమార్ ప్రధాన నిందితులతో నకిలీ విత్తనాలను కమిషన్ వ్యాపారం చేస్తూ దందా సాగిస్తున్నాడని చెప్పారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితురాలు, ప్రధాన నిందితుడు శ్రీనివాస్ రెడ్డి భార్య నైరుతి సీడ్స్ భాగస్వామి ఏనుబోతుల రజిత భర్త నకిలీ విత్తనాల దందాకు చేదోడుగా నిలుస్తూ అతడి అనుచరులను సమన్వయం చేస్తుండేదని ఐజీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన జిల్లా పోలీసులను ఆయన అభినందించారు.

### నకిలీ విత్తనాలను విక్రయించేందుకు లక్ష్యంగా..

ఈ ముఠా తయారు చేసిన నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు వర్షాధారిత పంటలు ఎక్కువగా వేసే ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, వరంగల్, రంగారెడ్డి జిల్లాతోపాటు పలు ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల విక్రయానికి యత్నించారు.

### రైతులను నమ్మించేందుకు ఐసీఏఆర్ లేబుల్..

పత్తి విత్తనాల లైసెన్స్, విక్రయాలకు అనుమతి లేకుండానే శ్రీనివాస్ రెడ్డి తాను విక్రయించే నకిలీ విత్తనాలను నాణ్యమైనవిగా రైతులను నమ్మించేందుకు నాగ్‌పూర్‌కు చెందిన ఐసీఏఆర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లుగా అవసరం లేకున్నా ప్యాకింగ్ కవర్లపై ముద్రిస్తున్నాడని వివరించారు.

# సీఎం కేసీఆర్ సిద్దిపేట పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీశ్

సిద్దిపేట, జూన్ 18: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన సిద్దిపేట పోలీసు కమిషనరేట్, సమీకృత కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను సీఎం కేసీఆర్ ఈనెల 20న ప్రారంభించనున్నారు. ఈల నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను మంత్రి హరీశ్ రావు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు పలు సూచనలిచ్చారు.

ఆధునిక హంగులతో రూ. 81కోట్ల వ్యయంతో జిల్లా కార్యాలయాల సమీకృత భవన సముదాయం, పోలీస్ కమిషనరేట్ భవనాలు నిర్మించారు. సిద్దిపేట శివారులో 29 ఎకరాల విస్తీర్ణంలో జీ+2 విధానంలో పోలీస్ కమిషనరేట్ ఇప్పటికే సిద్ధమైంది. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సిద్దిపేట హౌసింగ్ బోర్డులో కొత్తగా నిర్మించిన విషయం తెలిసిందే.



# బ్లాక్ మార్కెట్‌లో పత్తి విత్తనాలు అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



పెద్దపెల్లి, జూన్ 18:: అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో పత్తి విత్తనాలను అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..జిల్లాలోని మంథని పోలీస్ స్టేషన్ పరిధి ఉప్పట్ల గ్రామంలో కాశెట్టి రవి అనే వ్యక్తి పత్తి విత్తనాల ప్యాకెట్లని ఎలాంటి బిల్లులు లేకుండా బ్లాక్ లో అధిక ధరలకు అమ్ముతున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ తన సిబ్బందితో కలిసి రవి ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో రెండు కంపెనీలకు సంబంధించిన 48 పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శనేశ్వర ఆలయంలో చోరీ.. 48 గంటల్లోనే నిందితుల అరెస్ట్

వికారాబాద్, జూన్ 18: : జిల్లాలోని మోమిన్‌పేట్ మండలం ఎన్కతల గ్రామ పరిధిలోని శనేశ్వర ఆలయంలో చోరీకి పాల్పడిన కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. ముగ్గురు నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి అలయంలో దొంగలించిన సుమారు ఆరు కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ కు తరలించామని జిల్లా ఎస్పీ నారాయణ తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డ్ అందజేస్తామన్నారు.

# ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవ



మహబూబ్‌నగర్, జూన్ 18:: మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో బెడ్ల ఏర్పాటు విషయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక చొరవతో గాఎనిణవనిబిజీ ఎనిటతిజీ ఆఖీ ద్వారా మహబూబ్ నగర్ లోని వివిధ ఆస్పత్రుల్లో 100 బెడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

# మొక్కలు నాటి సంరక్షిద్దాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, జూన్ 18:: ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారిపై బహుళ వరుసలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాబోయే వారం పది రోజుల్లో రాష్ట్ర అటవీ శాఖ మంత్రితో హరిత హారం కింద జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరాలను వెల్లడించారు.

జిల్లాలో మొక్కలు నాటడం, నర్సరీల పెంపకతో పాటు 99 శాతం వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవటమే కాక మహిళా సంఘాలు 2 కోట్ల విత్తన బంతులు తయారు చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు కట్టే ముందు తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. మున్సిపాలిటీ కూడా ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటేలా చూడాలన్నారు.

పట్టణంలో ఎన్నో పార్కులను ఏర్పాటు చేశామని, వాటిని అందంగా తీర్చి దిద్దాలన్నారు. అదేవిధంగా బై పాస్ చుట్టూ, మధ్యలో కూడా మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక సంస్థలకు అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ కె.సి.నర్సింహులు, డీసీసీబీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కౌన్సిలర్ వనజ, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రచ్ఛన్న యుద్ధం- దిశగా యుయస్-చైనా పావులు కదుపుతున్నాయా ?

కరోనా విజృంభన నేపథ్యంలో రెండు అగ్రదేశాలు అమెరికా, చైనా మధ్య విభేదాలు తారస్థాయికి తాకుతున్నాయి. కోవిడ్-19 అనంతరం నెలకొన్న రాజకీయ, మిలటరీ ఉద్రిక్తతల నడుమ యుయస్, చైనాలు నేరుగా తలపడే స్థాయికి చేరడంతో రెండవ ప్రచ్ఛన్న యుద్ధం (సెకండ్ కోల్డ్ వార్) లేదా ప్రచ్ఛన్న యుద్ధం-? లేదా కొత్త ప్రచ్ఛన్న యుద్ధ(న్యూ కోల్డ్ వార్) వాతావరణం ఏర్పడిందని విదేశాంగ వ్యవహారాల నిపుణులు అంటున్నారు. గత ప్రపంచ చరిత్రను తిరగదోడితే మూడు దశాబ్దాలకు పూర్వం ప్రథమ ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం అమెరికా, రష్యాల మధ్య, ముఖ్యంగా సైద్ధాంతిక విభేదాల కారణంగానే జరిగాయని తెలుస్తున్నది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత సమసిపోయిందనుకున్న ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు నేడు తిరిగి యుయస్, చైనా దేశాల మధ్య పురుడు పోసుకోవడంతో 2వ ప్రచ్ఛన్న యుద్ధానికి బీజాలు పడ్డట్లుగా కనిపిస్తున్నది. కరోనా సృష్టి కర్త చైనా దేశమే అంటూ అమెరికాతో పాటు ప్రపంచ ప్రధాన దేశాలన్నీ అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం జరుగుతోందని, చైనా దూకుడుకు కళ్లెం వేస్తూ నియంత్రించడానికి జో బైడెన్ నాయకత్వం నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) మరియు క్వాడ్ (క్వాడ్రీలాటరల్ సెక్యూరిటీ డైలాగ్) కూటములను బలపరచడం జరుగుతున్నది. నేడు జరుగుతున్న యుయస్- చైనా ప్రచ్ఛన్న యుద్ధ మేఘాలను తరిమేందుకు ఎలాంటి ప్రభావవంతమైన 'ప్రపంచ పోలీసింగ్ వ్యవస్థ' అందుబాటులో లేదు. ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో ఇతర అభివృద్ధి చెందిన మరియు చెందుతున్న దేశాలు కూడా తమ తమ పాత్రను పోషించే స్థాయిలోనే ఉండడం గమనించాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ లాంటి దేశాలు కూడా ప్రధాన భూమికను నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే చైనాతో తలపడుతూ, ధీటైన సమాధానాలను ఇస్తున్న భారత్‌తో పాటు యుకె, ఆస్ట్రేలియా లాంటి దేశాలు కూడా అమెరికా పక్షాన నిలబడనున్నాయనేది వాస్తవం. అదే విధంగా గ్రీస్, సౌదీ, స్పెయిన్, ఇరాన్, ఇథియోపియ, టర్కీ లాంటి దేశాలు కూడా ప్రపంచ శక్తియుక్తులు, రాజకీయాల్లో తమ ప్రాధాన్యతను చూపనున్నాయని తెలుస్తున్నది. అమెరికా, చైనాల మధ్య విభేదాలు ఈనాటివేమీ కాదు. వాషింగ్టన్, బీజింగ్‌ల మధ్య పోరు ముదిరితే రెండవ ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతూ, ప్రపంచదేశాలన్నీ రెండు పక్షాలుగా విడిపోక తప్పని పరిస్థితి వస్తుందని అంటున్నారు. చైనాతో అమెరికా సంబంధాలు అంశాల వారీగా ఉంటాయని, సహకారం మరియు సవాళ్ళు కలిసిన నూతన అంశాల వారీ విధానంతో ఉంటున్నాయని అవగతం అవుతున్నది. వివిధ సందర్భాలలో రెండు దేశాలు తీవ్రంగా విమర్శల దాడి చేసుకోవడానికి కూడా వెనకాడడం లేదు. నేడు అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, వ్యాపార రంగాలు విడదీయరానంతగా విస్తృతితో అల్లుకుపోయాయని, నేడు 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కృత్రిమ మేధ, 5జి, జీవాయుధాలు ప్రపంచాన్ని కొన్ని గంటల్లోనే వినాశనం చేయవచ్చని గమనించాలి. ఈ పరిస్థితుల్లో చైనా ఎలాంటి సంకోచం లేకుండా విపరీత ధోరణితో మహా విపత్తుకు కూడా ఒడిగట్టవచ్చని చరిత్ర చెబుతున్నది. నేడు ఒకే ఆలోచన కలిగిన ప్రజాస్వామ దేశాలకు (లైక్-మాండెడ్ డెమక్రసీస్: అమెరికా, యూకె, ఆస్ట్రేలియా, ఇండియా లాంటివి) మరియు నిరంకుశ విరోధుల (ఆటోక్రసీస్: చైనా, రష్యా లాంటివి) మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగనున్నది. నాటి యుయస్-రష్యా ప్రచ్ఛన్న యుద్ధానికి, నేటి యుయస్-చైనా విభేదాల కారణాలకు సారూప్యతలు కనిపించవు. ఈ యుద్ధ మేఘాలు చిక్కబడితే అమెరికా-చైనా మిలటరీ ఘర్షణలు జరిగి విధ్వంసకర పరిణామాలకు దారి తీయవచ్చు.

నాటి డోనాల్డ్ ట్రంప్ నాయకత్వం చైనాను కరోనా సృష్టికర్త అంటూ బహిరంగంగా ప్రకటించడంతో పాటు తీవ్ర స్థాయిలో వాణిజ్య మరియు టెక్నాలజీ యుద్ధం ప్రకటించడం చూశాం. నేడు జో బైడెన్, గ్జీ జింపింగ్‌ల మధ్య 'అసౌకర్య శాంతి (అన్‌ఈజీ పీస్)'తో పాటు 'వాణిజ్య పోటీ (ట్రేడ్ వార్)' మాత్రమే జరుగుతోందని, దీనిని ప్రచ్ఛన్న యుద్ధం అనరాదని వాదించే వారు కూడా ఉన్నారు. నేటికీ సింగపూర్ లాంటి కొన్ని ఆసియా దేశాలు రెండు పక్షాల విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరుతుంటే తటస్థంగా ఉంటున్నాయి. ఇటీవల నాటో సెక్రటరీ జనరల్ స్టోటెన్‌బర్గ్ మాట్లాడుతూ యుయస్ చైనాల మధ్య ట్రేడ్ వార్ మాత్రమే జరుగుతోందని, ప్రచ్ఛన్న యుద్ధం-? కాదని అనడం గుర్తు చేసుకోవాలి. యుయస్ పూర్వ భద్రత సలహాదారు హెన్రీ కిసింజర్ మాట్లాడుతూ వాషింగ్టన్, బీజింగ్‌ల మధ్య విభేదాలు పెరుగుతూ ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణ దిశగా కదలడం ప్రపంచానికే పెనుప్రమాదం కావచ్చని అనడం జరిగింది. ప్రపంచ వాణిజ్యరంగంలో అతి పెద్ద శక్తిగా ఎదిగిన చైనాతో అమెరికా గట్టి పోటీని ఎదుర్కోవడంతో ఆదిపత్య పోరు పరిస్థితులు కనిపిస్తున్నాయి. నాటి యుయస్, రష్యా యుద్ధ వాతావరణంతో పోల్చితే నేడు రెండు సూపర్ పవర్ల మధ్య ఆర్థిక, సాంకేతిక, మిలటరీ శక్తుల ఏకీకరణ పోరుతో ప్రపంచ ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చని భయపడుతున్నారు. నేడు ప్రత్యక్ష ప్రపంచ యుద్ధం-3 కన్న ప్రచ్ఛన్న యుద్ధం-2తోనే ప్రపంచ దేశాలు బాగా నష్టపోవచ్చని అర్థం అవుతున్నది. అతి చిన్న పోరు జరిగినా అపార నష్టం జరిగే ప్రమాదం ఉందనడంలో అతిశయోక్తి లేదు. అమెరికా చైనాలు ఆదిపత్య ఆలోచనలు మరిచి, ఆరోగ్యకర ఆర్థిక-వాణిజ్య-టెక్నాలజీ పోటీతో ప్రపంచ శాంతికి ఊతం ఇవ్వాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# నోటీసులపై లోక్ సభ స్పీకర్ కార్యాలయం స్పందన..

హైదరాబాద్ , జూన్ 18:తనను ఏపీ సీఐడీ అధికారులు శారీరకంగా హింసించారంటూ వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామ కృష్ణరాజు సభాహక్కుల నోటీసును ఇచ్చిన సంగతి తెలిసిందే. సీఎం జగన్ కు సంబంధించిన బెయిల్ ను రద్దు చేయాలని తాను సీబీఐ కోర్టులో పిటిషన్ వేసినందుకే తనపై కేసులు నమోదు చేశారని ఆయన తన నోటీసుల్లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా తనపై థర్డ్ డిగ్రీని ప్రయోగించారని తెలిపారు. ఏపీ సీఎం, సీఐడీ ఏడీజీ, సీఐడీ ఎస్పీలపై ఈ నోటీసులు ఇచ్చారు. వీటిపై లోక్ సభ స్పీకర్ కార్యాలయం స్పందించింది.

ఇదే అంశానికి సంబంధించి రఘురాజు కుమారుడు భరత్, టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్ నాయుడు కూడా స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను స్పీకర్ కార్యాలయం పరిగణనలోకి తీసుకుంది. ఈ అంశానికి సంబంధించి పూర్తి వివరాలను అందించాలంటూ కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించింది. 15 రోజుల్లోగా వివరాలను అందించాలని కేంద్ర హోంశాఖకు నోటీసులు పంపిం

# ఘనంగా జననేత టి.ఆర్.కె జన్మదిన వేడుకలు...

## 200ల మందికి అన్నదానం చేసిన టి ఆర్ కె ట్రస్ట్ ప్రతినిధులు×ల






రాజన్న సిరిసిల్ల, జూన్ 18(నేటినిజం ప్రతినిధి): నిత్యం ప్రజాసేవకై పరితపించే నాయకుడు, కరోనా కష్టకాలంలో ప్రజల కష్టాలు తెలుసుకొని వారికి అండగా నిలబడి మనో ధైర్యం నింపిన ×నిస్వార్థ సేవకుడు... జననేతగా పేరు తెచ్చుకున్న శ్రీ తోట రామ్ కుమార్× జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా ×టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్× ఆధ్వర్యంలో రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేసి తోట రామ్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజన్న ఆలయ పరిసరాల్లో ఉండే 200ల మంది యాచకులకు అన్నదానం చేశారు.

అనంతరం ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ తోట రామ్ కుమార్ ఇలాంటి పుట్టినరోజు మరెన్నో జరుపుకోవాలని శ్రీ రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పులి రాంబాబు, ముప్పిడి శ్రీధర్ గంగవరపు శ్రీధర్, ట్రస్ట్ వర్కింగ్ టీం ఎంక్వయిరీ, టీం సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్తగా 6341 కరోనా కేసులు-57 మంది మృతి

అమరావతి, జూన్ 18:ఏపీలో కరోనా తీవ్రత అదే స్థాయిలో కొనసాగుతుంది. తాజాగా గడిచిన 24గంటల్లో మొత్తం 1,07,764 మందికి పరీక్షలు చేయగా 6,341 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. అలాగే మరోవైపు కొత్తగా గడిచిన 24 గంటల్లో 57మంది మరణించారు. అలాగే గడిచిన 24 గంటల్లో 8,486 మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నారు.

ఇక ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 67,629కి చేరుకుంది.

తాజా గణాంకాల ప్రకారం ఏపీలో మొత్తం కేసుల సంఖ్య 18,39,243 కి చేరుకుంది. అలాగే డిశ్చార్జ్ కేసుల సంఖ్య 17,59,390కి పెరిగింది. ఇక మొత్తం మరణాల సంఖ్య 12,224 కి చేరింది.

# హుజూరాబాద్ లో హీటెక్కిన రాజకీయం!

హైదరాబాద్ , జూన్ 18:హుజురాబాద్ లో రాజకీయం హీటెక్కింది. ఉప ఎన్నిక నేపథ్యంలో ఈటల వర్సెస్ టీఆర్ఎస్ ఉన్నట్టుగా మారాయి. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాక బీజేపీలో చేరిన మాజీ మంత్రి ఈటల దూకుడు పెంచారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. టీఆర్ఎస్ పై విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. మరోవైపు జిల్లా మంత్రులు, టీఆర్ఎస్ నేతలు హుజురాబాద్ లో మకాం వేశారు. ఉప ఎన్నికలో టీఆర్ఎస్ ను గెలిపిస్తే అసలు అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామంటూ ప్రచారం మొదలు పెట్టారు. పార్టీ క్యాడర్ ఈటల వైపు వెళ్లకుండా వ్యూహాత్మకంగా ముందుకు పోతున్నారు. అటు టీఆర్ఎస్, ఇటు బీజేపీ నేతల పర్యటనలతో హుజూరాబాద్ నియోజకవర్గం వేడెక్కింది.

మంత్రులు కొప్పుల ఈశ్వర్ , గంగుల కమలాకర్ లు గత మూడు రోజులుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ ఇద్దరు మంత్రులు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు వరాలు కురిపిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ రెండుగా చీలిపోయింది. చాలా మంది ఈటల వెంటే నడుస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ క్యాడర్ చేజారిపోకుండా టీఆర్ఎస్ పార్టీ జాగ్రతలు తీసుకుంటోంది. గురువారం కొప్పుల ఈశ్వర్ జమ్మి కుంటలో కార్యకర్తలతో సమావేశం కాగా, గంగుల కమలాకర్ హుజూరాబాద్ లో రేషన్ డీలర్ల సమావేశంలో పాల్గొని వరాల జల్లులు కురిపించారు. పార్టీని నమ్ముకున్న వారికి ఖచ్చితంగా అండగా ఉంటామని మంత్రి కొప్పుల కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పార్టీని వీడవద్దని హితబోధలు చేశారు.

ఈటల రాజేందర్‌ది ఆత్మగౌరవం కాదని, ఆత్మవంచన అని ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. తన వ్యక్తిగత విషయాలను ప్రజలపై రుద్దుతున్నాడని మండిపడ్డారు. ప్రజలను భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ వ్యాపారం చేసేందుకు సిద్ధమయ్యాడని దుయ్యబట్టారు. పార్టీలో పదవులన్నీ అనుభవించిన ఈటల, టీఆర్ఎస్‌ను ఎందుకు వీడాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిన్నటి దాకా నల్ల చట్టాలు.. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టిన విషయాలను మరిచిపోయావా?అని నిలదీశారు. మతతత్వ పార్టీలో చేరిన ఈటలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

**హుజూరాబాద్ లో హీటెక్కిన రాజకీయం!**

హుజూరాబాద్ నియోజకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసిన రూ.35 కోట్ల నిధుల గురించిన మంత్రి గంగుల ప్రజలకు వివరిస్తున్నారు. హుజురాబాద్ లో అభివృద్ధి అంటే ఏంటో తాము చూపిస్తామంటూ స్టేట్ మెంట్లు ఇస్తున్నారు. రేషన్ డీలర్ల సభలో కేంద్రప్రభుత్వం కమీషన్ నిధులు విడుదల చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ అందించిందని గుర్తు చేశారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో ఈటల టీఆర్ఎస్ పార్టీకి చేసిన వెన్నుపోటుపై కూడా ప్రజలకు వివరించే పనిలో ఉన్నారు.

ఈటల రాజేందర్‌కు ఆస్తులపై ఉన్న తాపత్రయం, అభివృద్ధిపై లేదని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గ ప్రగతిని ఏనాడూ పట్టించుకోలేదన్నారు. తు సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. త్వరలో రాష్ట్రంలోని 4.5 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని తెలిపారు. 57 ఏండ్లు ఉండి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరుచేస్తామని చెప్పారు. రాబోయే ఉపఎన్నికలో హుజూరాబాద్‌లో గులాబీ జెండాను ఎగరేస్తామని ధీమా వ్యక్తంచేశారు. రైతుబంధు డబ్బులు ఈ నెల 25 వరకు ప్రతి ఒక్కరి ఖాతాలో జమవుతాయని చెప్పారు.

ఈటల రాజేందర్ బీజేపీలో చేరిన తరువాత గురువారం మొదటి సారి హుజురాబాద్ లో అడుగుపెట్టారు. ఆయనకు ప్రజలు, బీజేపీ కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. నాలుగు రోజు ల పాటు నియోజవర్గంలో విస్తృతంగా పర్యటించేందుకు ఈటల ఏర్పాట్లు చేసుకున్నారు. హుజూరాబాద్‌లో కాషాయ జెండా ఎగరేస్తామని ఈటల అన్నారు. ఉప ఎన్నిక అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, సీనియర్ నాయకులందరినీ కలుపుకొని వాడవాడలో తిరుగుతూ పార్టీని బలోపేతం చేస్తానన్నారు. మంత్రులకు ఆత్మగౌరవం ఉందా? అని ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఉప ఎన్నికలో తనను ఓడించేందుకు మండలానికి ఒక మంత్రి, గ్రామాలకు ఎమ్మెల్యేను ఇన్‌చార్జులుగా నియమించడాన్ని చూస్తే ప్రభుత్వంలో భయం స్పష్టంగా కనిపిస్తోందని ఈటల అన్నారు.

**హుజూరాబాద్ లో హీటెక్కిన రాజకీయం!**

2023లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు హుజూరాబాద్ ఉప ఎన్నిక రిహార్సల్, దిక్సూచిలా ఉంటుందని ఈటల వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దె దింపుతామన్నారు. నాడు తెలంగాణ ఉద్యమానికి కరీంనగర్ జిల్లా ఎట్లా అండగా నిలిచిందో, ఆ జిల్లాకు హుజూరాబాద్ ఎలాగైతే ఊపిరి పోసిందో, నేడు మలి దశ ఉద్యమానికి, ఆత్మగౌరవ పోరాటానికి, రాచరికాన్ని బొంద పెట్టడానికి కేంద్ర బిందువుగా మారుతుందని, మళ్లీ పొలికేక వేస్తుందన్నారు. ఆత్మ గౌరవ పోరాటానికి హుజూరాబాద్ వేదిక కాబోతున్నదన్నారు. సీఎం కేసీఆర్ అహంకారానికి హుజూరాబాద్ ప్రజలు రాబోయే రోజుల్లో ఘోరీ కట్టడం ఖాయమని ఈటల వ్యాఖ్యానించారు. మొత్తం మీద కేసీఆర్ సర్కార్ తాయిలాలు ఓవైపు? ఆత్మగౌరవం అంటూ ఈటల సెంటిమెంట్ మరోవైపుతో ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారు? అన్నది ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో హుజూరాబాద్ రాజకీయం ఆసక్తి రేపుతోంది

# ఇండియా విలవిలలాడింది.. ల్యాబ్ లీక్ ప్రమాదమే : డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, జూన్ 18:: కరోనా వైరస్ మహమ్మారితో ఇండియా విలవిలలాడినట్లు అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. అయినా ఆ దేశం అద్భుత రీతిలో కోలుకుంటోం దన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ వ్యాప్తి చెందడానికి చైనానే కారణమని, ఆ దేశం అమెరికాకు పది ట్రిలియన్ల డాలర్లు చెల్లించాలంటూ పేర్కొన్నారు. గురువారం ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పది ట్రిలియన్ల డాలర్లు కాదు.. నిజానికి చైనా ఇంకా ఎక్కువే చెల్లించాలన్నారు.

**ల్యాబ్ లీక్ ప్రమాదమే..**

వుహాన్ ల్యాబ్ నుంచి ప్రమాదవశాత్తు కరోనా వైరస్ బయటకు వచ్చి ఉంటుందని ట్రంప్ అన్నారు. చైనా అసమర్థత వల్లే వుహాన్ ల్యాబ్‌లో ఆ ప్రమాదం జరిగి ఉంటుందని ట్రంప్ అనుమానం వ్యక్తం చేశారు. కానీ ఆ ప్రమాదం గురించి చాలా తెలుసుకోవాలని, ఎలా జరిగింది, ఎందుకు జరిగిందన్న కోణంలో విచారణ జరగాలన్నారు. అలాంటి వైరస్ ప్రయోగాల సమయంలో ఎలా అసమర్ధంగా ఉంటారని ట్రంప్ ప్రశ్నించారు. నిజానికి మనకు వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయని, కానీ మరీ యువకులకు వ్యాక్సిన్లు ఇవ్వాలన్న టెన్షన్ వద్దు అని, ఆ ప్రక్రియను ఆపాలన్నారు. ఎందుకంటే దేశాన్ని ఆర్థికంగా నడపాల్సిన సమయం ఇది అన్నారు.

**పిల్లలకు వద్దు..**

మనం వ్యాక్సిన్లను తయారు చేయడం గొప్ప విషయమని, కానీ స్కూల్ పిల్లలకు పెద్దగా వైరస్ ప్రభావం ఉండదని, 99.99 శాతం పిల్లలకు కోవిడ్ వ్యాక్సిన్ అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అనవసరంగా దీని గురించి ఆలోచించవద్దు అని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే చర్యలు తీసుకోవాలన్నారు.

# అక్టోబర్ లో కరోనా థర్డ్ వేవ్..చిన్నారులపై ఎఫెక్ట్ : సర్వే



న్యూఢిల్లీ, జూన్ 18: భారత్ లో అక్టోబర్ లో కరోనా థర్డ్ వేవ్ వ్యాపిస్తుందని, చిన్నారులపై దీని ప్రభావం ఉంటుందని రాయ్ టర్స్ నిర్వహించిన సర్వే వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, శాస్త్రవేత్తలు, వైరాలజిస్టులు, ప్రొఫెసర్లతో కూడిన 40 మంది ప్రొఫెషనల్స్ తో ఈ స్నాప్ సర్వేను నిర్వహించారు. దవాఖానలు, ఆక్సిజన్, వ్యాక్సిన్లు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో తదుపరి కరోనా వైరస్ వేవ్ ను మెరుగ్గా కట్టడి చేయవచ్చని సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతం మంది అభిప్రాయపడ్డారు.

దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ సాగుతుండటంతో వైరస్ కేసుల సంఖ్య తక్కువగా ఉండవచ్చని ఈ సర్వేలో పాల్గొన్న ఎయిమ్స్ చీఫ్ డాక్టర్ రణదీప్ గులేరియా ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతుండటంతో కేసులు తక్కువగా వస్తాయని వాటిని నియంత్రించడం తేలికవుతుందని అన్నారు. సెకండ్ వేవ్ వ్యాప్తితో కొంతమేర సహజ రోగనిరోధకశక్తి సమకూరిందని పేర్కొన్నారు.

ఇక సర్వేలో పాల్గొన్న వారిలో 85 శాతం మంది అక్టోబర్ లో భారత్ లో థర్డ్ వేవ్ తలెత్తుతుందని చెప్పగా, ఆగస్ట్ లోనే వస్తుందని ముగ్గురు, సెప్టెంబర్ లో థర్డ్ వేవ్ ఉంటుందని 12 మంది అంచనా వేశారు. ఇక నవంబర్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తదుపరి ఇన్ఫెక్షన్లు ఉంటాయని సర్వేలో పాల్గొన్నవారిలో ముగ్గురు చెప్పుకొచ్చారు. సర్వేలో పాల్గొన్న 40 మందిలో 26 మంది థర్డ్ వేవ్ 18 ఏండ్లలోపు వారిపై ప్రభావం చూపుతుందని చెప్పారు. అయితే థర్డ్ వేవ్ చిన్నారులపై ప్రభావం చూపదని 14 మంది వైద్య నిపుణులు స్పష్టం చేశారు.

# ముగ్గురు పిల్లలకు ఉచితంగా రూ.50.1 కోట్ల విలువైన ఇంజెక్షన్లు, ఔషధాలు

బెంగళూరు, జూన్ 18:: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ముగ్గురు పిల్లలకు రూ.50.1 కోట్ల విలువైన ఇంజెక్షన్లు, ఔషధాలు ఉచితంగా అందాయి. కర్ణాటక రాజధాని బెంగళూరుకు చెందిన ఎన్జీవో సంస్థలు వీటిని ఉచితంగా సమకూర్చాయి. వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ముగ్గురు పసి పాపలు బెంగళూరు బాప్టిస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఒక పాపకు 14 నెలలు, మరో పాపకు 16 నెలలు. ఈ ముగ్గురికి జోల్జెన్స్మా అనే ఖరీదైన జన్యు చికిత్సను ఉచితంగా అందజేశారు. ఇందలో భాగంగా శరీరంలో జన్యు సంకేతాన్ని మార్చగల సామర్థ్యమున్న రూ.16 కోట్ల విలువైన వన్-టైమ్ ఇంజెక్షన్‌ను ఒక్కొక్కరికి ఇచ్చారు.ముగ్గురు పిల్లలకు కలిపి రూ.48 కోట్ల విలువైన ఇంజెక్షన్లు లాటరీ వ్యవస్థ ద్వారా తయారీ కంపెనీ ఉచితంగా ఇచ్చిందని ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఒకే వ్యాధితో బాధపడుతున్న ముగ్గురు బాలికలకు ఒక్కొక్కటి రూ.70 లక్షల (ముగ్గురికి రూ.2.1 కోట్ల ) విలువైన స్పిన్‌రాజా అనే ఔషధాన్ని కూడా ఇచ్చినట్లు చెప్పారు. డైరెక్ట్ రిలీఫ్ అనే ఎన్జీవో సంస్థ వీటిని ఉచితంగా ఇచ్చిందని, దీంతో మొత్తంగా రూ.50.1 కోట్ల విలువైన మందులు వారికి ఉచితంగా అందాయని వెల్లడించారు. కోట్ల ఖరీదైన ఈ డ్రగ్స్ తయారీకి 8-10 ఏండ్లు పడుతుందన్నారు.

# లివా మిస్ దివా 2021 డిజిటల్ రూపంలో

హైదరాబాద్, జూన్, 18: ప్రతి సంవత్సరం మాదిరిగానే, పోటీదారుడు దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభను అరుదుగా అందిస్తాడుఈ అవకాశన్ని. మీరు అవకాశం అందు కోవాడానికి సిద్ధంగా ఉ




న్నారా..హైదరాబాద్: మిస్ దివా తన 9 వ ఎడిషన్‌ను లివా అనే ఫ్యాషన్‌తో కలిసి విడుదల చేస్తున్నట్లు ప్రకటించిందిటైటిల్ స్పాన్సర్‌గా పదార్థ బ్రాండ్. మన చుట్టూ ఉన్న ప్రతిదీ మా సాధారణ నిర్వచనాన్ని మార్చింది, కానీయం. ఎక్స్ టకా టక్ -శక్తితో పనిచేసే లివా మిస్ దివా 2021, అదే స్థాయిలో ఉత్సాహాన్ని నింపేందుకు 'సిద్దంగా ఉందని నిర్వహకులు విడుదుల చేసిన ప్రకటనలో తెలిపారు. తదుపరి అందాల రాణిని డైనమిక్ కొత్త ఫార్మాట్‌లో కనుగొనటానికి ఉత్సాహం, అది డిజిటల్‌పై ప్రభావం చూపుతుందిమీడియా .ఇండియా మిస్ యూనివర్స్ యొక్క ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు గెలుచుకుంది, ఇటీవలి విజయంతోలివా మిస్ దివా 2020 టైటిల్ గెలుచుకున్న అడ్లైన్ కాస్టెలినో, భారతదేశాన్ని ప్రపంచానికి తిరిగి ఇచ్చింది3 వ రన్నర్ అప్ గా మిస్ యూనివర్స్ 2020 యొక్క మ్యాప్. 2013 సంవత్సరంలో ప్రారంభమైన ప్రయాణం ద్వారా, మిస్ దివా ప్రతిభావంతులైన యువకులను విప్పుతూనే ఉందిభారతీయ మహిళలు దాని గౌరవనీయమైన పోటీ ద్వారా. కిరీటం యువతకు ఎంతో విలువైన కీర్తి మాత్రమే కాదులేడీస్, కానీ ఈ మహిళలు తమను తాము భవిష్యత్ యొక్క నిజమైన చిహ్నంగా చూపించడానికి దారితీసే వేదిక మరియు ప్రపంచం ముందు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలనే వారి కలను సాకారం చేసుకోండి. మేము దీని ద్వారా మా మద్దతును ప్రతిజ్ఞ చేస్తాము తరువాతి తరం స్త్రీ చరిష్మా మమ్మల్ని అత్యంత విశిష్టమైన రంగాలలో నడిపించడానికి. వారసత్వాన్ని కొనసాగిస్తోంది8 సంవత్సరాలలో, గౌరవనీయమైన శీర్షిక యువ ప్రతిభను గుర్తించడానికి వస్త్రధారణ, ప్రోత్సహించడం మరియు శక్తివంతం చేస్తుందిఅంతర్జాతీయ వేదికలపై మ మించిపోయే సంభావ్యత యొక్క పెరుగ ఎతున్న తెగను ప్రతిబింబిస్తుందిఅంతర్జాతీయ సరిహద్దుల్లో అంచనాలు.అందువల్ల యూనివర్స్ 'కొత్త సాధారణ'కు అనుగుణ ంగా ఉన్నప్పుడు, ఈ సంవత్సరం కూడా? ప్రదర్శన తప్పక సాగుతుంది. ఆన్ మిస్ దివా తన 9 వ ఎడిషన్‌లో, కంఫర్ట్ నుండి ఆడిషన్స్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని మీకు తెస్తుందిమీ ఇంటి. డైనమిక్ కొత్త ఫార్మాట్ ద్వారా నడిచే, లివా మిస్ దివా 2021 దాని సంప్రదాయాన్ని కొనసాగిసుందిఅందమైన, నమ్మకంగా, డైనమిక్, ఉత్సాహపూరితమైన నిర్వచనాన్ని విప్లవాత్మకంగా మార్చే ఒక అమ్మాయిని కనుగొనండినాయకత్వం వహించే సామర్థ్యం ఉన్న కొత్త తరం మహిళలకు పూర్తి హృదయపూర్వక మద్దతును అందించడం లక్ష్యంగా పెట్టుకుందిభవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించండి. జూన్ 11న ప్రారంభమైన ఈ పోటీ, ప్రతినిధులను ఎన్నుకోవటానికి దేశవ్యాప్తంగా వేటను ప్రకటించిందివారి కలలను వాస్తవికతగా మార్చడానికి దేశవ్యాప్తంగా ఎ ఎస్ పి త్సాహిక దివాస్ పాల్గొనవచ్చు.ఈ ఫైనలిస్టుల ఎంపిక ప్రక్రియ నిర్దిష్ట ఆడిషన్‌ను ఆహ్వానించే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కలిగి ఉంటుం దిభారతదేశం యొక్క ప్రముఖ చిన్న వీడి యో ప్లాట్‌ఫాం - యం ఎక్స్ టకాటాక్‌లో టాస్క్ సమర్పణలు ఆ తరువాత, షార్ట్‌లిస్ట్ చేసిన 20 మంది ఫైనలిస్టులు ముంబైలో కఠినమైన శిక్షణ మరియు వస్త్రధారణ చేస్తారుఅక్టోబర్ 2021 లో గ్రాండ్ ఫినాలేలో గౌరవనీయమైన కిరీటం కోసం పోటీపడండి.

# వ్యాక్సిన్ తో స్పెర్మ్ కౌంట్ తగ్గలేదు..

హైదరాబాద్ , జూన్ 18:కరోనా వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల పురుషుల్లో లైంగిక సామర్థ్యం తగ్గలేదని తేలింది. యూనివర్సిటీ ఆఫ్ మియామీ పరిశోధకులు తమ నివేదికలో ఈ విషయాన్ని చెప్పారు. రెండు డోసుల ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు తీసుకున్నవారిలో.. వీర్యకణాల సంఖ్య ఏమాత్రం తగ్గలేదని రుజువైంది. మొత్తం 45 మంది పురుషులపై ఈ అధ్యయనం చేశారు. వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు, ఆ తర్వాత వారి లైంగిక సామర్థ్యాన్ని పరీక్షించారు. నిజానికి అమెరికాలో ఓ భయం వ్యాప్తిస్తున్నది. వ్యాక్సిన్ తీసుకున్నవారిలో లైంగిక సామర్థ్యం తగ్గుతున్నట్లు జనం భయపడుతున్నారు. అయితే మియామి వర్సిటీ స్టడీ ఆ అనుమానాలను పటాపంచలు చేసింది.

లైంగిక సామర్థ్య పరీక్షలో పాల్గొన్న పురుషుల్లో 21 మంది ఫైటజర్ టీకాను, 24 మంది మోడెర్నా వ్యాక్సిన్ తీసుకున్నారు. ఈ రెండు టీకాలను ఎంఆర్ఎన్ఏ విధానంలో తయారు చేశారు. అయితే వారి వీర్యకణాలకు జరిపిన పరీక్షల్లో.. బేస్‌లైన్ స్పెర్మ్ కాన్‌సెంట్రేషన్, టోటల్ మొబైల్ స్పెర్మ్ కౌంట్.. 26మిలియన్లు/ఎంఎల్, 36 మిలియన్లు ఉన్నట్లుగా నిర్ధారించారు. రెండవ డోసు తర్వాత వారిలో వీర్యకణాల సంఖ్య స్వల్పంగా 30 మిలియన్లు/ఎంఎల్, టోటల్ కౌంట్ 44 మిలియన్లకు పెరిగినట్లు తేల్చారు. టీకా తీసుకున్న తర్వాత ఎంత పరిమాణంలో వీర్యం ఉత్పత్తి అవుతున్నది, వీర్యకణాలు దూసుకెళ్తున్న తీరు ఎలా ఉందో స్టడీలో నిర్ధారించారు. సీమెన్ వాల్యూమ్‌తో పాటు స్పెర్మ్ మోటిలిటీ కూడా గణనీయంగా పెరిగినట్లు పరిశోధకులు చెప్పారు. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ జర్నల్‌లో ఈ నివేదికను ప్రచురించారు.

# ఈనెల 21 నుంచి కూతపెట్టనున్న శతాబ్ది, దురంతో రైళ్లు

హైదరాబాద్ , జూన్ 18:కరోనా ఎఫెక్ట్ తో దేశంలో రైల్వే సర్వీసులు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ప్రస్తుతం కరోనా వైరస్ కేసులు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో రైల్వే తన సర్వీసులను తిరిగి పట్టాలెక్కిస్తోంది. కొన్ని ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైళ్లను రైల్వే నడుపుతుండగా? ఈనెల 21 నుండి పలు మార్గాల్లో నడిచే ట్రైన్లను రైల్వేశాఖ ప్రకటించింది.

ఈ జాబితాలో శతాబ్ది, దురంతో పాటు 29 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. వీటికి అదనంగా ఈ నెల 25 నుంచి సమ్మర్ స్పెషల్ రైళ్లను గోరఖ్‌పూర్ నుంచి బాంద్రా టెర్మినస్ వరకు నడుపుతామని కేంద్ర రైల్వేమంత్రి తెలిపారు. ఇందులో న్యూఢిల్లీ-కల్కా శతాబ్ది, న్యూఢిల్లీ-డెహ్రాడూన్ శతాబ్ది, న్యూ ఢిల్లీ-అమృత్‌సర్ జంక్షన్ శతాబ్ది, ఢిల్లీ సారాయ్ రోహిల్లా-జమ్ముతావి దురంతో ఎక్స్‌ప్రెస్, శ్రీమాతా వైష్ణోదేవి కత్రా-న్యూఢిల్లీ శ్రీ శక్తి ఎక్స్‌ప్రెస్, లక్నో-ప్రయాగ్‌రాజ్ సంగం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 21 నుంచి నడవనున్నాయి.

# వైద్యుల నిర్లక్ష్యం.. వృద్ధురాలికి ఒకేసారి కొవిషీల్డ్, కొవాగ్జిన్

పట్నా, జూన్ 18:: కరోనా వ్యాక్సినేషన్ విషయంలో బీహార్‌కు చెందిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఓ వృద్ధురాలికి కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో కొవిషీల్డ్, కొవాగ్జిన్ టీకాలను ఇచ్చారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు ఆలస్యంగా ఈ విషయాన్ని గ్రహించారు. పట్నా శివార్లలోని పున్‌పున్ పట్టణం బేల్దారిచల్ ఏరియా అవధ్‌పూర్ గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. అవధ్‌పూర్ గ్రామానికి చెందిన సునీలా దేవి (65) బుధవారం కొవిడ్ టీకా తీసుకునేందుకు టీకా కేంద్రానికి వెళ్లింది. అక్కడ 18 ఏండ్ల నుంచి 45 ఏండ్ల వారికి కొవిషీల్డ్, 45 ఏండ్లు పైబడిన వారికి కొవాగ్జిన్ టీకాలు ఇస్తున్నారు. ఈ రెండు రకాల టీకాలను ఒకే గదిలో ఇస్తుండటంతో నిరక్షరాస్యురాలైన నీలాదేవి ముందుగా 18 నుంచి 45 ఏండ్ల వయసువారితో క్యూ లైన్‌లో నిలబడింది. దాంతో వైద్యులు ఆమెకు కొవిషీల్డ్ టీకా ఇచ్చారు.ఆ తర్వాత కాసేపు పక్కన కూర్చోమని చెప్పారు. వైద్యులు చెప్పనట్లే పక్కన కూర్చున్న నీలాదేవి 45 ఏండ్ల పైబడిన వారికి టీకా ఇచ్చే లైన్‌లో తాను వెళ్లలేదని గ్రహించింది. దాంతో తాను తీసుకున్నది సరైన టీకా కాదనుకుని మళ్లీ రెండో లైన్‌లో వెళ్లి కొవాగ్జిన్ టీకాను కూడా తీసుకున్నది. అయితే కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో రెండు రకాల వ్యాక్సిన్ డోసులు తీసుకున్న నీలాదేవికి వెంటనే జ్వరం వచ్చింది.

దాంతో జరిగిన పొరపాటును గ్రహించిన వైద్యులు.. ఆమెను 24 గంటలపాటు ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షిస్తుందనే హామీ ఇచ్చి పంపించారు. కానీ గంటల సమయం గడిచినా వైద్యులుగానీ, నర్సులుగానీ ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించలేదు. నీలాదేవికి గొంతు తడారిపోతుంటే ఆమె కుటుంబసభ్యులే గ్లూకోజ్ తాపుతూ సపర్యలు చేశారు. కాగా, నీలాదేవికి వ్యాక్సినేషన్ విషయంలో పొరపాటు తమదేనని అవధ్‌పూర్‌కు చెందిన ఏఎన్ఎం అంగీకరించారు.ఇదిలావుంటే వ్యాక్సినేషన్ సెంటర్‌కు చెందిన మెడికల్ ఆఫీసర్ సంజయ్ కుమార్ ఈ ఘటనపై మాట్లాడుతూ.. రెండు రకాల వ్యాక్సిన్‌లు ఒకే గదిలో వేయడంతో నీలాదేవి పొరబడి రెండు వ్యాక్సిన్‌లు తీసుకున్నదని చెప్పారు. ఈ విషయంలో తమ సిబ్బంది పొరపాటు కూడా ఉన్నదని ఒప్పుకున్నారు. అయితే రెండు వేర్వేరు వ్యాక్సిన్‌లవల్ల నీలాదేవిలో తీవ్ర సమస్యలు ఎదురయ్యే అవకాశం ఏమీ లేదని సంజయ్ కుమార్ తెలిపారు.

# దహేగాంలో భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కొమురంభీం ఆసిఫాబాద్, జూన్ 18: : జిల్లాలోని దహేగాంలో నకిలీ విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు.

రూ. 17 లక్షల విలువైన 850 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.6 కోట్ల విలువైన నకిలీ పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్న 13 మంది సభ్యుల అంతరాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

మరొక ఘటనలో పెద్దపల్లి జిల్లా మంథని పోలీస్ స్టేషన్ పరిధి ఉప్పట్ల గ్రామంలో బ్లాక్‌లో పత్తి విత్తనాలు అమ్ముతున్న కాశెట్టి రవి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుండి 48 పత్తి విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

# ఆర్టీసీ కార్గో సేవలకు ఏడాది పూర్తి.. ఆదాయం రూ. 46 కోట్లు

హైదరాబాద్ , జూన్ 18: టీఎస్ ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభించి నేటితో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల నుంచి ఈడీల వరకు, ఏజెంట్ల నుంచి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల వరకు అందరిని అభినందిస్తూ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ శుభాకాంక్షలు తెలిపారు.

కేవలం సర్వీసు బస్సుల ద్వారా 32 లక్షల పార్శిల్స్ చేరవేయడంతో రూ. 34 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కార్గో బస్సుల ద్వారా రూ. 12 కోట్ల ఆదాయం రాగా, మొత్తం రూ. 46 లక్షల ఆదాయం వచ్చినట్లు మంత్రి అజయ్ కుమార్ పేర్కొన్నారు. 177 బస్ స్టేషన్ కౌంటర్లు, 810 మంది ఏజెంట్లతో కొనసాగుతున్న కార్గో, పార్శిల్ సేవలను మరింత విస్తరించే క్రమంలో రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లో కూడా హోం డెలివరీ సౌకర్యాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. వినియోగదారులు పార్శిల్, కార్గో సేవల్ని మరింత ఆదరించి సంస్థ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రి అజయ్ కుమార్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com